వాడ్రేవు చినవీరభద్రుడు

# ప్రత్యూషపవనాలు



వాడ్రేవు చినవీరభద్రుడు

# ప్రత్యూష పవనాలు

PRATYUSHA PAVANALU

A Bunch of Thoughts from the Great Thinkers

Compiled and tranlsated by

Vadrevu Ch Veerabhadrudu

First published, 1996

Second edition, 2026

Coverpage painting,  Composing and Lay-out

Vadrevu Ch Veerabhadrudu

e-book released by

Vadrevu Ch Veerabhadrudu

First Floor, 56, Navodaya Colony

Mehdipatnam

HYDERABAD

Telangana state 500 028

chinaveera@gmail.com

+91 94909 57129

For more resources please visit

www.chinaveerabhadrudu.in

వెలమూరి శ్రీరామ్‌కి

# మళ్ళీ తలుపులు తెరుస్తూ

**ముప్ఫైయ్యేళ్ళ** కిందట హైదరాబాదు వచ్చిన కొత్తలో, నా దగ్గరున్న కొన్ని తత్త్వశాస్త్ర గ్రంథాల్లో నాకు నచ్చిన కొన్ని పేరాలు అనువదించడానికి పూనుకున్నాను. వాటిని నేను తెలుగులో చెప్తుంటే మా అక్క వాటిని రాస్తూ వచ్చింది. వాటిని చూసి ఒక మిత్రుడు పుస్తకంగా ప్రచురించి తన పాఠకులకి ఉగాది కానుకగా పంపిస్తానంటే ఇచ్చాను. అలా 1996 లో ప్రచురించిన ఈ 'ప్రత్యూష పవనాలు', ఆ ప్రచురణ కర్త దగ్గర సరే, చివరకి నా దగ్గర కూడా ఒక్క కాపీ లేకుండా పోయింది.

మొన్న డిసెంబరులో పుస్తక ప్రదర్శనలో కూచుని ఉండగా, కొత్తగూడెం నుంచి వచ్చిన మిత్రుడు కిరణ్ నా రచనల్ని సేకరిస్తున్నట్టు తెలిసి ఆయన్ని ఈ పుస్తకం కోసం అడిగాను. ఆయన దగ్గర కూడా లేదు. కానీ నా అభ్యర్థనని ఆయన మర్చిపోలేదు. ఎలా సంపాదించేరో ఒక కాపీ సంపాదించి నాకోసం స్కాన్ చేసి మరీ పంపించారు.

ఇందులో అనువదించిన భాగాలు, ముప్ఫై ఏళ్ళ తరువాత ఇప్పుడు, చదువుతుంటే ఆ ఆలోచనలకి కాలం చెల్లిపోలేదనిపించింది. ఇప్పుడు చదివినా, ఎప్పుడు చదివినా ఎంతో కొంత స్ఫూర్తి కలిగించే శక్తి వీటికుందనిపించింది. అందుకని ఆ పుస్తకాన్ని మళ్ళా ఇలా మీ చేతుల్లో పెడుతున్నాను.

అయితే, నేను ఎంపిక చేసి అనువదించిన వాళ్ళల్లో స్త్రీలుగాని, నల్లజాతివారుగాని, ముస్లిములుగానీ, ఆదివాసులుగానీ లేదా దూరతూర్పుదేశాలకు చెందిన రచయితలు గానీ లేకపోవడం నాకు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తూ ఉంది. ముప్ఫై ఏళ్ళ కింద నా అధ్యయనానికి ఇంత పరిమితి ఉందని కూడా ఇప్పుడే తెలుస్తున్నది. కానీ ప్రపంచపవనాల్ని తెలుగునేల పైన ప్రసరింపచెయ్యాలన్న నా జీవితకాల తపస్సు ఇక్కణ్ణుంచే మొదలయ్యిందని కూడా నాకు గుర్తుంది.

ఇది నా అనువాదాల్లో మొదటి పుస్తకం. తర్వాత రోజుల్లో సత్యాన్వేషణగాని, ప్రపంచ తత్త్వశాస్త్ర పరిచయ గ్రంథాలుగాని నేను వెలువరించానంటే, దానికి నాందీప్రస్తావన ఈ చిన్ని పుస్తకమే. అందుకని ఈ పుస్తకాన్ని మళ్ళా మీకు అందించాలనుకున్నాను. అయితే మొదటిసారికన్నా మరింత మెరుగైన పద్ధతిలో లే ఔట్ చేసి అందించాలనిపించింది. ఆ ఆకాంక్షకి ఫలితమే ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం. దీన్ని మిత్రుడు వెలమూరి శ్రీరామ్‌కి ఇలా కానుక చెయ్యడం సంతోషంగా ఉంది, కానీ ఆయన చేతుల్లో పెట్టలేకపోతున్నందుకు విచారంగానూ ఉంది.

హైదరాబాదు **వాడ్రేవు చినవీరభద్రుడు**

ఆషాఢ బహుళ ఏకాదశి,

9-8-2026

# అభివందనం

**అసిసీకి** చెందిన ఉత్తమ సాధుపురుషుడు సెయింట్ ఫ్రాన్సిస్ గురించి రాస్తూ జి.కె. చెస్టర్టన్ ఒక విలువయిన మాటన్నాడు. జీవితానందం అనేది కొందరికి విశ్వాసకారణం కాగా మరికొందరికి విశ్వాసఫలితం అని. కాగా నిజానికి ప్రపంచమంతటా అన్ని కాలాల్లో జీవించిన ఉత్తమోత్తమ సాధుపురుషులందరి విషయంలో జీవితానందం విశ్వాసకారణం, విశ్వాసఫలితం కూడా.

ఆ విశ్వాసం ఒక పరిపూర్ణ దైవభావన పట్ల కావచ్చు. ఒక గ్రంథం, ఒక హేతువు, ఒక చలనసూత్రం, ఒక నిశ్చలసంకేతం, సత్యం, శివం, సుందరం ఏదయినా కావొచ్చు.

కాగా దృఢమైన విశ్వాసంతో ప్రభాతభానులవలె వికసించిన అటువంటి మహనీయుల రచనలు చదువుతుంటే మనకు నిశాంత వేళ పుణ్యనదుల మించి వీచే

ప్రత్యూష పవనాల స్పర్శానుభవం కలుగుతుంది. కాగా ఈ స్పర్శ దేహానికి కాదు, ఆత్మకి. ఇది ఒక సంతోషదర్శనం, దివ్యజీవనంలోకి పునరుజ్జీవనం. ఇందులోని ఒక రచయిత రాసినట్లుగా, ఈ రచనలు చదవడం, ప్రతి దినం మనల్ని మనం renew చేసుకోవడం, జీవిత పరమార్థానికి అర్హుల్ని చేసుకోవడం.

ఆ నమ్మకంతోనే ఆ సాధుపురుషులందరికీ అభివందనం ఘటిస్తూ ఈ ప్రత్యూషానికి ఇట్లా బంగరు వాకిలి తెరుస్తున్నాం.

హైదరాబాద్ వాడ్రేవు చినవీరభద్రుడు
ఫాల్గుణ శుద్ధ ఏకాదశి, 1996

# అనుక్రమణిక



| | | |
|---|---|---|
| **ప్లేటో** | మృత్యుంజయుడు | 11 |
| **మార్కస్ అరీలియస్** | వివేకం కన్న మించింది లేదు | 15 |
| **స్పినోజా** | ఆరోగ్యవంతమైన ఎరుక | 17 |
| **టాల్‌స్టాయి** | సంతోష దర్శనం | 19 |
| **థోరో** | ఆదిత్య హృదయం | 22 |
| **నీషే** | సుదూర మానవుడి పట్ల ప్రేమ | 25 |
| **బెర్ట్రాండ్ రస్సెల్** | విజ్ఞానమూ వివేకమూ | 28 |

| | | |
|---|---|---|
| **ఆల్బర్ట్ ఐన్‌స్టీన్** | సంఘమూ వ్యక్తిత్వమూ | 33 |
| **మహాత్మాగాంధీ** | భగవంతుడంటే | 37 |
| **బాలగంగాధర తిలక్** | పరిపూర్ణ మానవత్వం | 41 |
| **రవీంద్రనాథ్ టాగూర్** | మానవుని మతం | 45 |
| **సర్వేపల్లి రాధాకృష్ణన్** | దివ్యత్వంలోనికి పునరుజ్జీవనం | 48 |
| **అంబేద్కర్** | ప్రజ్ఞాన్విత ధర్మం | 50 |
| | శ్రీరామ్! | 53 |




# ప్లేటో

## మృత్యుంజయుడు

**'ధైర్యం** వహించండి మిత్రులారా, మరణించబోతున్నది నా దేహం మాత్రమే' ఈ మాటలంటూ ఆయన లేచి క్రీటోతో కలిసి స్నానశాలలో అడుగుపెట్టాడు. మమ్మల్ని వేచి ఉండమన్నాడు. మేం అట్లానే వేచి ఉన్నాం. మా గొప్ప విషాదం గురించి మాట్లాడుకొంటూ, ఆలోచిస్తూ. మేము కోల్పోబోతున్న ఆ మహనీయుడు మా తండ్రి వంటివాడే, ఇక తక్కిన జీవితమంతా మేం అనాథల వలే బతకాలి. ఆయన లోపల స్నానం చేస్తూండగానే చాలా సమయం గడిచిపోయింది. సూర్యాస్తమయం కావొచ్చింది. బయటకు వచ్చిన తరువాత తిరిగి మాతో చాలాసేపు కూర్చున్నాడు.. కానీ ఏమంత మాట్లాడలేదు.

కొద్దిసేపట్లోనే జైలరు వచ్చి ఆయన దగ్గర నుంచొని ఇలా అన్నాడు, 'సోక్రటీస్! ఇక్కడికి వచ్చిన మనుష్యులందరిలో చాలా గొప్పవాడివి, సజ్జనుడివి నువ్వేనని నాకు

తెలుసు. పై అధికారులు చెప్పిన విధంగా నేను ఇట్లానే విషాన్ని అందించేటప్పుడు తక్కిన మనుష్యులు ఏ విధంగా ఉద్రేకపడి నాపైన ఆగ్రహం చూపిస్తుంటారో, అటువంటి ఆగ్రహాన్ని నీ విషయంలో నేను ఊహించలేను. నాకు నమ్మకమే, నువ్వు నాపైన ఆగ్రహించవని. ఏమంటే ఈ అపరాధానికి కారణం నేను కాదు. తక్కిన వాళ్ళే. మరింక వీడ్కోలు. జరగవలసిన దాన్ని భరించడానికి సిద్ధపడు. నా కర్తవ్యం నీకు తెలుసు'. ఇట్లా అంటూనే ఉప్పొంగుతున్న కన్నీళ్ళతో అతను వెనక్కి తిరిగి బయటికి వెళ్ళిపోయాడు.

అతన్ని చూస్తూ సోక్రటీసు అన్నాడు. 'నీ అభిమానానికి నా ధన్యవాదాలు. నువ్వు ఎట్లా చెప్తే ఆ ప్రకారమే చేస్తాను.' అప్పుడు మా వైపు తిరిగి మాతో అన్నాడు. 'ఎంత చక్కటి మనిషి ఇతను! నేను జైల్లో ఉన్నంత కాలమూ నన్ను చూడ్డానికి వస్తూనే ఉన్నాడు. ఇప్పుడు చూడండి, నా కోసం ఎంత అభిమానంతో దుఃఖపడుతున్నాడో! కానీ ఆయన చెప్పినట్లే చేయాలి మనం. క్రీటో! ఆ గిన్నె తీసుకుని రా! ఒకవేళ విషం తయారయి ఉంటే. లేకపోతే కొద్దిగా విషం తయారు చెయ్యమని జైలు సేవకుడికి చెప్పండి.'

'ఇంకా సూర్యుడు అస్తమించనే లేదే!' క్రీటో అన్నాడు. 'తొందర పడవద్దు, ఇంకా సమయం ఉంది. పూర్వం మనుష్యులు విషం తాగేటప్పుడు చాలా ఆలస్యం చేసేవాళ్ళు. విషపానానికి ముందు తినేవాళ్ళు, తాగేవాళ్ళు, సకలభోగాలూ అనుభవించే వాళ్ళు తెలుసునా!'

'నిజమే క్రీటో' సోక్రటీసు అన్నాడు. 'నీవు ఎవరి గురించి చెప్తున్నావో వాళ్ళు, అలా చెయ్యడం సమంజసమే. ఏమంటే ఆ కొద్ది ఆలస్యంలోనే వాళ్ళేదో పొందినట్టు వాళ్ళకి సంతృప్తి. కానీ నేను కూడా అట్లా చెయ్యడం సమంజసం కాదు. ఏమంటే ఈ విషం తాగడం కొద్దిగా ఆలస్యం చేసినంత మాత్రాన నేను కొత్తగా పొందేది ఏమి ఉందనుకోను. అలా చెయ్యడం ఇప్పటికే ముగిసిపోయిన ఒక జీవితాన్ని కొనసాగించే ప్రయత్నమే అవుతుంది. అట్లాంటి ఊహకి నాపట్ల నాకే నవ్వొస్తుంది. దయచేసి నేను చెప్పినట్టు చెయ్యి. నాకు అడ్డుపడవద్దు.'

ఆయన అట్లా చెప్పగానే క్రీటో జైలు సేవకుడికి ఆజ్ఞ ఇచ్చాడు. అతను లోపలికి వెళ్ళి కొంతసేపు లోపలనే ఉండి విషపాత్రతోను, జైలరుతోను తిరిగి వచ్చాడు. ఆ

సేవకుడితో సోక్రటీస్ అన్నాడు 'మిత్రుడా! నీకు ఇట్లాంటి వాటిల్లో బాగా అనుభవం ఉంటుంది కదా! నేను ఇప్పుడు ఏంచెయ్యాలో నాకు కొద్దిగా సూచనలు ఇవ్వు.'

దానికి అతడు అన్నాడు కదా 'మీరు చెయ్యవలసినదల్లా మీకాళ్లు బరువెక్కినదాకా పచార్లు చేయడం. అప్పుడు విశ్రమించడం. అప్పుడు విషం పనిచేయడం మొదలవు తుంది.' అతను ఆ విషపాత్రను సోక్రటీసుకు అందించాడు. సోక్రటీసు ఏవిధమైన భయంగాని, ముఖంలో లేదా కవళికల్లో ఏ చిన్న మార్పుగాని లేకుండా ఎంతో గంభీరంగా, సునాయాసంగా ఆ గిన్నె అందుకుంటూ ఆ సేవకుడిని చూస్తూ అన్నాడు 'నేను ఇప్పుడు ఎవరైనా దేవతలను ప్రార్థించుకోవచ్చునా?'

'సోక్రటీస్! నేను చెయ్యగలిగినదల్లా విషం సిద్ధం చెయ్యడమే' అన్నాడు అతను.

'నేను అర్థం చేసుకోగలను' సోక్రటీసు అన్నాడు. 'ఈ నా యాత్ర చరమాంకంలో దేవతలను ప్రార్థించనివ్వండి. దైవం నా ఈ ప్రార్థనని ఆలకించుగాక.'

అప్పుడాయన ఆ గిన్నెను పెదవుల దగ్గరకు చేర్చుకుని సంతోషంతో, సంసిద్ధతతో ఆ విషాన్ని పూర్తిగా తాగేసాడు.

ఇంతదాకా మాలో చాలా మందిమి మా దుఃఖాన్ని అణుచుకోగలిగాం. కాని ఇప్పుడాయన విషం తాగడం చూడగానే, చివరి గుక్క కూడా పూర్తి అవడం చూడగానే ఇంకెంతమాత్రం మమ్మల్ని మేం ఆపుకోలేకపోయాం. నేను ఎంత ప్రయత్నించినా ఆగకుండా కన్నీళ్ళు ప్రవహిస్తూనే ఉన్నాయి. నేను రోదిస్తూ ఉండినది ఆయన కోసం కాదు, అటువంటి మహనీయ సహచరుణ్ణి కోల్పోతున్న నా మహాదురదృష్టం గురించిన ఆలోచన వల్లనే. ఆ బాధ పడుతున్న వాళ్ళలో మొదటి వాణ్ణి నేనే కాదు. క్రీటో అయితే తన కన్నీళ్ళు తను ఆపుకోలేక లేచి బయటికి వెళ్ళిపోయాడు. అతని వెనకాలే నేనూ.

సరిగ్గా అప్పుడే అప్పటి దాకా ఏడుస్తూనే ఉన్న అపోల్లోదొరస్ దుఃఖంలో గావు కేక పెట్టాడు. ఆ దుఃఖంలో నిబ్బరంగా ఉన్నది సోక్రటీసు ఒక్కడే. ఆయన తన ప్రశాంత వదనంతో 'ఎందుకీ రోదనం' అని 'నేను స్త్రీలందరిని ఇక్కడ ఉండకుండా పంపించివేసింది ఇట్లా రోదిస్తారనే. మనిషి మరణించేటప్పుడు ప్రశాంతంగా ఉండాలని పెద్దలు చెప్పగా విన్నాను. శాంతంగా ఉండండి. కొద్దిగా ఓపిక పట్టండి' అన్నాడు.

ఆ మాటలు విని మేము సిగ్గుపడ్డాము. మా కన్నీళ్ళను ఆపుకున్నాము. అప్పుడు ఆయన కొద్దిసేపు పచార్లు చేసాడు. తన కాళ్ళల్లో ఓపిక తగ్గుతోందని చెప్పి పక్క మీద వెల్లకిలా పడుకున్నాడు, ఇంతకు ముందు సూచించినట్టే. ఆయనకు విషాన్ని ఇచ్చిన మనిషి ఆయన పాదాలను, కాళ్ళను అప్పుడప్పుడు చూస్తూనే ఉన్నాడు. కొద్ది సేపు తర్వాత ఆయన పాదాన్ని గట్టిగా నొక్కి నొప్పి తెలుస్తోందా? అన్నాడు. లేదన్నాడు ఆయన. ఇంక అప్పుడు ఆయన కాళ్ళని నెమ్మదిగా పైపైకి నొక్కి చూస్తూ ఆయన దేహం నెమ్మదిగా కొయ్యబారుతోందని చూపించాడు మాకు. ఆ విషయం అర్థం కావడంతో సోక్రటీసు అన్నాడు. 'ఈ విషం హృదయానికి చేరడంతో అంతా ఆఖరవుతుంది.' విషం కటిప్రదేశం దాకా చేరి శరీరం కొయ్యబారుతూ ఉండగా తన దుప్పటి తొలగించుకుని ఆయన తన చిట్ట చివరి మాటలను పలికాడు. 'క్రీటో! దేవతలకు నేనొక్క కోడిపుంజు బాకీ పడ్డాను. నా ఋణం తీర్చిపెట్టగలవా?'

'నీ మొక్కు తప్పకుండా చెల్లిస్తాను. ఇంకా ఏమయినా ఉందా?' అనడిగాడు క్రీటో.

ఈ ప్రశ్నకి అక్కడ నుంచి సమాధానమేమీ లేదు. ఒకటి రెండు క్షణాల పాటు ఏదో కొద్దిగా కదలిక తోచింది. జైలు సేవకుడు ఆయన దుప్పటి పూర్తిగా తొలగించాడు. ఆ కళ్ళు నిశ్చలంగా ఉన్నాయి. క్రీటో ఆ కళ్ళని, నోటిని నెమ్మదిగా మూసేసాడు.

నా మాన్యుడయిన మిత్రుడి జీవిత చరమాంకం ఆ విధంగా ముగిసింది. నేనీ ప్రపంచంలో ఎరిగి ఉన్న మానవులందరిలో ఆయన నిస్సందేహంగా వివేకవంతుడు, న్యాయవంతుడు, ఉత్తమోత్తముడు. ●




## మార్కస్ అరీలియస్

## వివేకం కన్న మించింది లేదు

**ప్రతి** ఒక్కపనీ నువ్వు సత్ప్రవర్తనా నియమాలకు అనుణంగా చెయ్యలేక పోయినప్పుడు నిస్పృహ పడవద్దు. నిరాశపడవద్దు. అసంతృప్తి చెందవద్దు. అట్లా నువ్వు చెయ్యలేక విఫలమయినప్పుడు, మళ్ళా వెనక నుంచి మొదలుపెట్టు. నువ్వు పాటించగలిగిన దాన్లో అధికాంశం మనుష్య స్వభావానికి అనుగుణంగా ఒదిగినట్లయితే నిజంగా సంతోషించు, మళ్ళా మొదలు పెట్టినందుకు ఆనందించు. నీతిశాస్త్రాన్ని నువ్వెప్పుడూ నీ యజమానిగా భావించకు. అప్పుడే నువ్వు వివేకాన్ని అనుసరించగలుగుతావు. దాన్లో నమ్మకం పెట్టుకోగలుగుతావు. నీతిశాస్త్రం కోరేదీ, నీ స్వభావరీత్యా నువ్వు కోరుకునేదీ కూడా ఒకటేనని గుర్తు పెట్టుకో. కాగా నీలో స్వభావానికి విరుద్ధమైనది ఇంకేదో ఉండి ఉంటుంది. దాన్ని వెతికి పట్టుకుని ప్రశ్నించుకో. నేను పాటించాలనుకున్న ఈ నియమం కన్నా అధికమయింది ఏముంది దీనిలో అని. బాగా తరచి చూడు.

వ్యామోహాల రూపంలో తాత్కాలికానందాల రూపంలో మనని మోసగించి పోతున్నది ఇదే కదూ? చూడు. దీనికన్నా ఔదార్యం, స్వేచ్ఛ, నిరాడంబరత్వం, సమభావం, దయ సౌహార్ద్రం ఇవి అధికమయినవి కావూ? వివేకం కన్నా నిజంగా అభిలషించ గలిగింది ఏమన్నా వుందేమో చూడు. అవగాహనపైనా, జ్ఞానం పైనా ఆధారపడి అన్నిటికీ సుఖాన్నీ, సంతోషాన్ని, ఇచ్చే మంచి తోవ కోసం నువ్వు వెతుక్కున్నప్పుడు వివేకం కన్నా మించింది ఏమన్నా వుందా లోకంలో? ప్రతి ఒక్క సందర్భంలోనూ నిన్ను నువ్వు ప్రశ్నించుకో— నాలో ఉన్న ఈ ఆత్మ ఎవరిది? పసివానిదా? యువకునిదా? అబలదా? నియంతదా? గోవుదా? మృగానిదా? ఈ క్షణాన నా జీవితాన్ని నిర్ణయించే ప్రధాన సూత్రం ఏది?— దాన్ని కనిపెట్టి అనుకరించడమే నీ కర్తవ్యం. ●




# స్పినోజా

## ఆరోగ్యవంతమైన ఎరుక

**గర్వమనేది** మనిషికి తనపట్ల తనకుండే దురభిమానం నుండి పుట్టే అనారోగ్యకరమయిన సంతోషం. అందుకనే గర్విష్టి తనని యధార్థంగా చూడగలిగిన సజ్జనుల్ని ఒదిలిపెట్టి తన మీద బతికే పరాన్నభుక్కుల్నీ, వందిమాగధుల్నీ దగ్గరకు చేరదీస్తాడు.

ఒక మనిషి ఎదుటివాళ్ళ గురించి ఉన్నదానికన్నా తక్కువగా ఆలోచిస్తే కూడా అతన్ని మనం గర్విష్టి అనవచ్చు. కాబట్టి గర్వమంటే మనం ఎదుటివాళ్లకన్నా అధికులమనే అసత్య భావన లోంచి పుట్టే నీచమయిన ఆనందం అనుకోవచ్చు.

కాగా నిరాశనేది ఇందుకు విరుద్ధంగా ఎదుటి వాళ్ళకన్నా మనం తక్కువ అనుకునే అసత్యపు భావనలోంచి పుట్టే బాధ అనుకోవచ్చు. కాబట్టి గర్విష్టి తనకన్నా ఉత్తమ సుగుణాలు కలిగిన మనుషుల పట్ల అసూయతో కుమిలిపోతాడు. అందుకే

అతను నీచుల సహవాసాన్నే కోరుకుంటాడు. వాళ్ళ సహవాసంలో అతనిలోని మూర్ఖుడు ఉన్మాదిగా  పరిణమిస్తాడు.

నిరాశ గర్వం కన్నా భిన్నమయినప్పటికీ, నిరాశాపరుడు ఎంతో కొంత గర్విష్టి మానవుడిని పోలివుంటాడు. ఏమంటే అతని విషాదం ఎదుటివాళ్ళ సుగుణాల్తో తన చాతకానితనాన్ని పోల్చుకోవడం వల్ల అధికమవుతుంది కాబట్టి, అతను ఏదో ఒక మేరకు ఎదుటివాళ్ళ బలహీనతల్ని వెదుక్కుని వాటిని తల్చుకుని మురిసిపోతుంటాడు. ఇతరుల కన్నా తనని మరింత తక్కువగా భావించుకుంటున్న కొద్దీ అతని బాధ మరింత అధికమవుతుంది. కాబట్టే నిరాశపరుడిని మించి అసూయాగ్రస్తుడు మరొకడుండడు. అతను ఇతరుల చేతలని పరిశీలించేది సరిదిద్దటానికి కాక లోపాలు ఎంచడానికే. ఇలా చెయ్యడం ద్వారా అతను ఇతరుల చేతల్లోని వైఫల్యాలకీ, పరాజయాలకి పెద్దపీట వేస్తాడు. చివరకి ఇది అతన్ని మరింత నిరాశపరుడిని చేస్తుంది.

అలాకాక మనం మన వివేకం చెప్పినట్టు నడుచుకుంటే, మనకోసం మనమెట్లాంటి మేలు కోరుకుంటామో, అటువంటి మేలే ఇతరులకీ కోరుకోగలుగుతాం కాబట్టి ఎవరేనా ఒకరు మరొకళ్ళకి మంచి చెయ్యడం మనం చూడగలిగితే, అది మన మంచికి కూడా నిలబెడుతుంది. మనం నిజంగా సంతోషించగలుగుతాం. అట్లా మంచిపని చెయ్యగలిగిన వ్యక్తిని అభిమానించగలుగుతాం. ఈ అభిమానం వివేక రహితంగా ఉండేది కాదు. ఆ వివేకం వల్ల కలిగేదే.

కాబట్టి నిజంగా ఈ జీవితంలో మానవుడికి ప్రయోజనకరమైనదేమన్నా వుంటే, అది తన వివేకాన్ని పరిపూర్ణమొనర్చుకోవడమే. ఇందులో అతని ఉన్నతానందమూ, నిజమయిన మహాభాగ్యమూ ఉన్నాయి. ఇంతకీ ఎవరికయినా నిజమైన భాగ్యం భగవంతుని గురించిన ఎరుక వల్ల కలిగే మనశ్శాంతి. భగవంతుడు బోధపడడమే నిజమయిన ఎరుక. కాబట్టి వివేకవంతుడయిన ఏ మానవుడికయినా అంతిమలక్ష్యం, తన జీవితాభిలాషలన్నిటినీ నియంత్రించే ఏకైక అభిలాష తనని తాను అర్థం చేసుకోవడమూ, తద్వారా తనకి ఎరుకపడే సర్వస్వాన్నీ అర్థం చేసుకోవడమే కావాలి. ●




## టాల్‌స్టాయి

# సంతోష దర్శనం

**మానవుని** పుట్టుక నుంచి మరణించే దాకా జీవించే జీవితం అతని అస్తిత్వాన్ని ఏర్పరుస్తుందని కాబట్టి ఈ జీవితకాలమంతా అతని ప్రధానలక్ష్యం సంతోష సముపార్జనే కావాలని నమ్ముతూ ఈ యాభయిఏళ్ళూ జీవించేను. ఆ సంతోషాన్నేదో పొందాలనే ప్రయత్నించాను. కాని కాలం గడుస్తున్నకొద్దీ అటువంటి సంతోషం ఏమీ లేదనీ, అట్లాంటిది ఉండే అవకాశము లేదనీ నాకు స్పష్టమవుతూ వచ్చింది. నేను వెతుక్కున్న సంతోషం నాకు దొరకకపోగా నాకు ఏదన్నా ఆనందం కలిగిన అది మరుక్షణం ఆనందం కాకుండా పోయేది. మృత్యువు మరింత మరింత గోచరమవుతూ అనివార్య మవుతున్న కొద్దీ నా అసంతోషం మరింత అధికమవుతూ ఉంది. ఈ సంతోష రహితమైన, అర్థరహితమైన జీవితంలో నా కోసం కాచుకున్నవి వేదనలు, అనారోగ్యం, వార్ధక్యమూ, వినాశనమూనేనని నాకు అర్థమయింది. ఎందుకట్లా జరగాలి? అని ప్రశ్నించుకున్నాను. నాకు ఏమీ సమాధానం దొరకలేదు. చివరకు మిగిలింది నిస్పృహనే.

సాధారణంగా కొందరు చెప్పేమాట— నువు నీ ఆనందాన్ని నీ కోసం కాదు ఇతరులకోసం సముపార్జించాలి అని. అంటే మనకు బాగా దగ్గరయిన వాళ్ళకోసం తక్కిన మనుషులందరి కోసం అన్న మాటని నేను కూడా కొన్నిసార్లు నమ్మడానికి ప్రయత్నించినా, నాకు తృప్తి కలగలేదు. మొదటి కారణం ఏమిటంటే నేను నా కోసం సంతోషాన్ని కోరుకోలేకపోవడం, రెండోది ఏమంటే ఈ ఇతరులు అన్నవాళ్ళు కూడా నాకులాగే అసంతోషంలోనో, మృత్యువులోనో కూరుకుని పోవడం. కాబట్టి వారి ఆనందం కోసం నా ప్రయత్నాలన్నీ విఫలమవుతాయనే అనుకున్నాను.

నిరాశపడక తప్పలేదు నాకు. కానీ ఈ నా నిరాశ నేనేదో అసాధారణ మానవుణ్ణి అయినందువల్ల కలుగుతోందని, తక్కిన మనుషులకి వాళ్ళు ఎందుకు బతుకుతున్నారో వాళ్ళకి తెలుసును కాబట్టి వాళ్ళకి నిరాశతో పని లేదని అనుకున్నాను.

దాంతో తక్కిన మనుషుల్ని పరిశీలించడం మొదలుపెట్టాను. చూడగా వాళ్ళకి తాము ఎందుకు జీవిస్తున్నారో, నా గురించి నాకు తెలిసిన దానికన్నా అధికంగా ఏమీ తెలీదనే అర్థం అయ్యింది. వాళ్ళు ఈ అజ్ఞానాన్ని తమ జీవిత సంరంభం మాటున దాచి పెట్టుకునే ప్రయత్నం చేస్తారు. కానీ నన్ను నేను ఈ జీవిత సంరంభంలోనే ఎల్లకాలం నిలుపుకోలేకపోయాను. నన్ను పదేపదే వేధిస్తున్న ఈ ప్రశ్నని ఏ సంరంభమూ దాచలేక పోయింది. చిన్నతనం నుంచీ నాకు బోధిస్తూ వచ్చిన విశ్వాసాలను, ఎప్పుడో నాకు తెలీకుండా నానుంచి రాలిపోయిన వాటిని ఇప్పుడు కొత్తగా నమ్మడం నాకు సాధ్యం కాలేదు. ఆ విశ్వాసాలను మరింత అధ్యయనం చేసిన కొద్దీ అక్కడ సత్యం ఉండే అవకాశం లేదని, ఉన్నదంతా ఆత్మవంచనా, ఆరాటాల దాస్యమూ, కపటమూ, దౌర్బల్యమూ, భయమూ, మూర్ఖత్వాలేనని బోధపడుతూ వచ్చింది. నా చిన్నతనపు విశ్వాసాలను తిరిగి పొందలేకపోయాను, అలాగని ఇతర జాతులు బోధించే విశ్వాసాలనూ నమ్మలేకపోయాను. ఏమంటే ఆ విశ్వాసాలన్నిటా అవే వైరుధ్యాలు, అదే అసంబద్ధత, పరస్పర ఖండనలు, అదే అవినీతి. ఇక ఏ విశ్వాసంలోనూ నా వేదనలకు పరిష్కారం దొరకదని నా ప్రశ్నకు సమాధానం లభించదని స్పష్టంగా బోధపడి, నేనెంత నిస్పృహ చెందేనంటే నాకు ఆత్మహత్యే శరణ్యమనుకున్నాను.

సరిగ్గా అప్పుడు నా విమోచన నాకు లభ్యమయింది. అన్ని వ్యాఖ్యానాలను పక్కన పెట్టి నేను సువార్తలను వాటి నిజమయిన అర్థాలను వెతుక్కుంటూ చదవడం

మొదలుపెట్టాను. వాటి అర్థం బోధపడిన కొద్దీ అవి క్రిస్టియన్ చర్చి మతాధిపతులు బోధించే దాని కన్నా భిన్నంగా ఒక నూతన అర్థంతో నాకు సమాధానాన్ని అందించాయి. ఈ సమాధానం, సువార్తలకు నాదయిన ఏదో ఒక ప్రత్యేక వ్యాఖ్యానమో, లేక క్రీస్తుకే సాధ్యమయిన ఏ ప్రత్యేక సాక్షాత్కారమో అయినందువల్ల కాదు. మానవ సంఘపు మహనీయ ప్రతినిధులందరికీ, సువార్తల కాలానికి ముందూ, ఆ తర్వాత కూడా— మోజస్ మొదలుకొని ఇషయ్యా, కన్ఫ్యూషియస్, ప్రాచీన గ్రీకులు, బుద్ధుడు, సోక్రటీస్ నుండి పాస్కల్, స్పినోజా, ఫిక్టే, ఫ్యూయర్ బా దాకా, ఇంకా అజ్ఞాతులైన, విస్మృతులైన అనేకులందరూ వేసిన ప్రశ్నకి జీవితం ఇచ్చిన ఏకైకసమాధానం అదే కనుక. వారంతా ఏ కర్మకాండనీ ఏ మతాన్ని అంగీకరించకుండా శోధించి ప్రవచించిన జీవితపరమార్థం అదే కనుక.

సువార్తల నుంచి నేను గ్రహించిన సత్యంలో, జ్ఞానంలో నేను ఏకాకిని కాననీ, భూత భవిష్య కాలాలకు చెందిన మహనీయులందరి సాన్నిధ్యంలోనూ ఉన్నాననీ బోధపడింది. ఈ జ్ఞానం వల్ల సత్యం నాకు బోధపడడమే కాదు, మరింతగా ధ్రువపడి నా గత ఇరవయ్యేళ్ళ జీవితమూ సంతోషభరితంగా జీవించడమే కాక, అంతే సంతోష భరితంగా ఇప్పుడు మృత్యువు కొరకు కూడా ఎదురు చూడగలుగుతున్నాను. ●




# థోరో

## ఆదిత్య హృదయం

**ప్రకృతితో** సమానమైన నిరాడంబరత్వంతో, ఇంకా చెప్పాలంటే ఒక అమాయక ముగ్ధత్వంతో నా జీవితాన్ని నింపుకోడానికి ప్రతి ప్రభాతమూ ఒక సంతోష శుభవార్తగా అనిపిస్తుంది నాకు. ప్రతి ప్రత్యూషాన్ని గ్రీకులు ఎంత గాఢంగా ఆరాధించేరో అలాగే ఆరాధిస్తున్నాను. పొద్దున్నే లేచి ఆ చిన్ని చెరువులో స్నానం చేశాను. అదంతా ఒక మతపరమైన కార్యక్రమంలాగ. ఒక చైనా చక్రవర్తి స్నానపు తొట్టి మీద వ్రాసి ఉండేదట— ప్రతి రోజూ నిన్ను నువ్వు కొత్తగా మార్చుకొమ్మని.

ప్రతి ప్రభాతమూ గతించి పోయిన ప్రాచీన మహాయుగాల్ని తిరిగి తీసుకొస్తుంది. మహావైభవాన్ని కీర్తించే భేరీ నినాదాలు నన్ను ఎంత ఆకర్షిస్తాయో, నా కుటీరం పక్కన తలుపులూ కిటికీలూ తెరుచుకుని తొలి వేకువ వేళ కూచున్నప్పుడు, ఆ చిన్న ఈగ చేసే అస్పష్ట మర్మర ధ్వని కూడా నన్ను అట్లాగే ఆకర్షిస్తుంది. అది ఒక హోమర్

కావ్యం వంటిది. గాలిలో మోగుతున్న ఒక ఇలియడ్, ఒక ఒడెస్సి. తన ఉద్వేగాన్ని, తన సంచారాన్ని తనే గానం చేస్తో. దానిలో బ్రహ్మాండమైనదేదో ఉంది— ఈ ప్రపంచపు నిరంతరాయమైన ప్రాణశక్తికీ, జీవశక్తికీ నిర్దిష్టమయిన ప్రకటన వంటిదేదో.

దినమంతటిలోనూ మహాస్మరణీయమైన కాలం ప్రభాతమే. అందునా వేకువ జాగృతమయ్యే గడియ. ఆ క్షణంలో, ఆ సమయంలో మనలో తక్కిన సమయమంతా నిదురించి ఉండేదేదో ఆ సమయాన మనలో మేలుకొని ఉంటుంది. ఏ ప్రభాతం పట్ల మన అంతరంగిక ప్రతిభ ద్వారా మనం జాగృతులం కామో, కేవలం యాంత్రికమయిన కార్యకలాపం కోసమే మనం కోలుకుంటామో, అటువంటి రోజు నుండి మనమేమీ ఆశించలేం, అట్లాంటి రోజును ఒక దినంగా భావించలేం కూడా.


ప్రతి నిశాంత వేళా ప్రభవించే ఒక మహోన్నతమైన జీవితం, మనం ఇంత దాకా దేని పట్ల అంధులుగా ఉన్నామో ఆ జీవితపు పవిత్ర సంగీతంతో కాక ఫాక్టరీ గంటల చప్పుడుతో లేవవలసి రావడం బాధాకరం. ఏ మానవుడైతే ప్రతి దినం ఒక పవిత్రమైన, కాంతివంతమైన ప్రభాత వేళలో ప్రారంభమవుతుందని గ్రహించడో అతనిది అంధకార బంధురమైన జీవితమే.

కొద్ది సేపు అతని ఇంద్రియ జీవితం గడిపిన అనంతరం మానవుని ఆత్మ లేదా అతని అవయవాలు కొత్త శక్తిని పోసుకుని తిరిగి తాము మరొక ఉదాత్త జీవితాన్ని జీవించగలవేమో ప్రయత్నించి చూస్తాయి. స్మరణీయమైనవన్నీ ప్రభాత వేళ, ప్రభాత వాతావరణంలో పునరుజ్జీవిస్తాయి. ప్రభాత వేళ మానవుని జ్ఞానశక్తులన్నీ మేల్కొంటాయని వేదాలు చెప్తున్నాయి.

కవిత్వమూ, కళలూ, మనిషి చేసే పనులన్నింటిలోనూ చాలా సుందరమైనవీ, స్మరించదగినవీ ప్రభాత వేళలోనే ప్రభవిస్తాయి. మహాకవులూ, మహావీరులూ, అందరూ ప్రభాత శిశువులే. వారి జీవనసంగీతం సూర్యోదయ వేళలోనే వినిపిస్తుంది. ఎవరి నిరంతరాయమైన, జీవస్ఫోరకమైన, చింతనా ప్రవాహం సూర్యానుసారియై ఉంటుందో అతనికి దినమెల్లా నిత్య ప్రభాతమే. గడియారం ఏ వేళ చూపిస్తే నేమి ? మనుషులు ఏ వైఖరి అవలంబిస్తేనేమి ? నేనెప్పుడు మేల్కొని ఉంటే అదే ప్రభాతం. అదే ప్రత్యూషం.

నైతికోద్యమం అంటే నిద్ర మత్తు విదుల్చుకోవడమే. కోటి మంది మనుషులు కాయకష్టం కోసం మేల్కొని ఉండడంలో ఆశ్చర్యం లేదు. కాని వారిలో ఏ ఒక్కడో

తీక్షణ జ్ఞాన చింతన కోసం మేలుకుని ఉంటాడు. అటువంటి వారిలో ఏ ఒక్కడో ఒక కవితాత్మక దివ్య జీవనం కోసం మేల్కొని ఉండడం అంటే నిజంగా జీవించి ఉండడమే. ●




# నీషే

## సుదూర మానవుడి పట్ల ప్రేమ

**మీరు** మీ పొరుగు వాళ్ళతో గుమికూడుతూ ఆ గుమికూడడానికి ఏవో మంచి పేర్లు పెట్టుకుంటారు. కానీ నేను చెప్తున్నాను మీకు. మీ పొరుగువారి పట్ల మీరు చూపించే ప్రేమ, మీ పట్ల మీకుండే దురభిమానం తప్ప మరేం కాదు. మీ నుంచి మీరు తప్పించుకోవడానికి మీ పొరుగు వారి చెంత చేరుతారు. దానిని ఒక సుగుణంగా చూపించబోతారు. మీ 'నిస్వార్థపు' లీలలు తెలుసు నాకు.

నేను మిమ్మల్ని మీ పొరుగు వాళ్ళని ప్రేమించమని చెప్పనా ? నిజానికి మీరు పొరుగు వాళ్ళని వదిలి పెట్టి, ఎవరు సుదూరంలో ఉన్నారో వారిని ప్రేమించమనే చెప్తాను.

పొరుగు వాళ్ళ పట్ల ప్రేమ కన్న సుదూర మానవుడి పట్ల ప్రేమ, భవిష్యమానవుడి పట్ల ప్రేమ, ఉన్నతమైనది. మానవుడి పట్ల ప్రేమకన్న మూలాల పట్ల ప్రేమ, స్వప్నాల

పట్ల ప్రేమ మరింత ఉన్నతమైనది. నీ వెనుకనే నిన్ను అనుసరిస్తున్న ఈ స్వప్నం—సోదరుడా! నీ కన్నా సుందరమైనది. నీ రక్త మాంసాలను దీనికి ఎందుకు అర్పించవు? కానీ నీకు భయం. అందుకే నీ పొరుగు వాడి దగ్గిరికి పారిపోతావు.

నీతో నిన్ను నువు అసలు భరించలేవు. చాలినంతగా నిన్ను నీవు ప్రేమించుకోలేవు. ఇప్పుడేమో నీ పొరుగువాడిని ప్రేమలోకి మోసపుచ్చాలనీ అతను పొరబడితే మురిసి పోవాలనీ కోరుకుంటున్నావు.

నువ్వు ఏ పొరుగువాడినో చేరడమో, లేక ఆ పొరుగువాడి పొరుగువాడితో చేరడమో కాక నీ నుండే ఒక మిత్రుడిని, అతని ఉద్వేగభరిత హృదయాన్ని రూపొందించు కోవడం మంచిది. నీ గురించి చక్కని మాటలు వినాలనుకున్నప్పుడు, నీ పొరుగు వాడిని దానికి సాక్షిగా పిలుస్తావు. అతను అట్లా మోసపోయి నీ గురించి మంచిగా భావిస్తున్నప్పుడు నువ్వు నీగురించి మంచిగా భావిస్తావు.

వ్యక్తి తనకు తెలిసిన దాన్ని కప్పిపుచ్చటమే కాదు, తెలియని దాన్ని కప్పిపుచ్చటం కూడా. ఇతరులతో మసిలేటప్పుడు నిన్ను నువు అలా కప్పిపుచ్చుకుని నీ పొరుగు వాడిని మోసపుచ్చుతావు.

ఏ మనిషైనా తనను తాను వెతుక్కుంటూనే పొరుగువాడిని చేరతాడు. లేదా తనను తాను కోల్పోడానికైనా. నీ పట్ల దురభిమానమే నీ ఏకాంతాన్ని నీకొక చెరసాలను చేసింది. ఈ రోజు పొరుగు వాడి పట్ల నీ ప్రేమకు నష్టపోయేది రేపటి మానవుడే. మీరు అయిదుగురు కూడినప్పుడు ఆరవవాడు తప్పకుండా నష్టపోతాడు.

మీ పండగలను కూడ నేను ఇష్టపడలేను. అక్కడ నటులు చాలా మంది. చివరికి ప్రేక్షకులు కూడా నటుల్లానే నటిస్తారు.

నీ కోసం ఉప్పొంగే హృదయం కలిగిన స్నేహితుడినే కోరుకుంటున్నాను. కానీ వర్షించే హృదయాలు నిన్ను ప్రేమించాలంటే ఆ ఆర్ద్రతని నీలో ఇంకించుకోవడం నీకు చేతకావాలి.

ఈ ప్రపంచం ఎవరిలో పరిపూర్ణమవుతుందో, ఎవరు మంచితనానికొక నిండైన పాత్ర కాగలుగుతారో అటువంటి సృజనశీలి అయిన మిత్రుణ్ణి, నీకొక పూర్ణ ప్రపంచం

కాగలిగిన వాణ్ణి కోరుకుంటున్నాను. ఒకప్పుడతని నుంచి తప్పించుకుపోయిన ప్రపంచం ఇప్పుడతని కొరకు తిరిగి సిద్ధమవుతోంది. చెడునుంచి మంచి వైపుగా పరిణామం, యాదృచ్ఛికం నుంచి ప్రణాళిక వైపుగా పరిణామం. భవిష్యత్తు, సుదూర భవిష్యత్తు— నీ జీవిత సూత్రం కానివ్వు. ఆగామి భవిష్యమానవుణ్ణి ఈ నాటి నీ స్నేహితుడిలో మేల్కొననివ్వు.

సోదరుడా! నేను మీ పొరుగువాడిని ప్రేమించమని సూచించను. సుదూర మానవుడిని ప్రేమించమనే హెచ్చరిస్తాను.

ఆ విధంగా జరతుష్ట్ర ప్రవచించాడు. ●




## బెర్ట్రాండ్ రస్సెల్

## విజ్ఞానమూ, వివేకమూ

**మనం** జీవిస్తున్న యుగం పూర్వ యుగాలన్నిటికంటే విజ్ఞానంలో ఎంతో పురోగమించి నప్పటికీ, అదే స్థాయిలో వివేకంలో ఎదుగుదల లేదని చాలామంది అంగీకరిస్తారు. కాని వివేకమంటే ఏమో నిర్వచించబోతేనూ, దాన్ని పెంచేందుకు ప్రయత్నించబోతేనూ మటుకు అంగీకారం అంతరిస్తుంది. నేనిప్పుడు వివేకమంటే ఏమిటో తెలుసుకోబో తున్నాను, అలాగే దాన్ని బోధించడానికి ఏమిటి చేయాలన్నదీనూ.

వివేకానికి దోహదపడే అంశాలెన్నో ఉన్నాయి. వాటిలో ముందు ఒక ప్రమాణాన్ని నిర్ణయించుకొందాం. ఒక సమస్యలోని అన్ని ముఖ్యాంశాల్నీ పరిగణనలోకి తీసుకొని దేని ప్రాముఖ్యతని దానికి చూడగలిగే శక్తి. సాంకేతికంగా వివిధ రకాలైన సాంకేతికవేత్తల వల్ల విస్తారంగానో, సంకీర్ణంగానో పెరిగిపోయిన ప్రత్యేక విజ్ఞాన శాస్త్రాలవల్ల ఈ శక్తి పూర్వంకన్నా ఇప్పుడు దుర్లభమవుతూవున్నది. ఉదాహరణకి,

శాస్త్రీయ ఔషధాల పరిశోధనలో మీరు నిమగ్నులయ్యారనుకుందాం. ఆ పని చాలా బౌద్ధిక శక్తినంతా వినియోగపర్చుకునేదిగా ఉందనుకుందాం. మీ ఆవిష్కరణలూ, పరిశోధనలూ బయట వైద్యశాస్త్రంపైన ఏ విధమైన ప్రభావం చూపుతున్నదీ తెలుసుకునే తీరిక మీకు ఉండదు. ఆధునిక వైద్యశాస్త్రం యూరోప్‌లో అమెరికాలో సాధించినట్లుగా మీరు కూడా ఆసియాలో ఆఫ్రికాలో శిశుమరణాల రేటును గణనీయంగా తగ్గించడంలో కృతకృత్యులయ్యారనుకుందాం. కాగా అనేక అధిక జనాభా దేశాల్లో ఆహార సరఫరా చాలకుండా పోవడం, దానివల్ల జీవన ప్రమాణం తగ్గిపోవడం అనే రెండు ఊహించని ఫలితాలకు మీకు తెలీకుండా మీరు కారణమవుతున్నారు.

ఇంకా చక్కని ఉదాహరణ తీసుకుందాం. ఇది ఇప్పుడు అందరి మనసుల్లో మెదులుతున్నదే. ఒక అనాసక్తమైన జ్ఞానతృష్ణతోనే మీరు అణు రహస్యాన్ని పరిశీలిస్తున్నా-రనుకుందాం. కాని మానవజాతిని ధ్వంసం చేయగలిగే ఉన్మాదుల హస్తాల్లోకి పోయి పడుతుంది ఆ రహస్యం. ఇటువంటి చోట, జ్ఞానార్జన వివేకవంతం కాకపోతే తప్పకుండా హానికరంగా పరిణమిస్తుంది. వివేకమంటే ఒక సమగ్ర దృష్టి అన్న అర్థంలో చూస్తే జ్ఞానార్హులైన సైంటిస్టులలో మాత్రం అది కొరవడుతుందనే అనాలి.

అయితే సమగ్రత అన్నది ఒక్కటే వివేకాన్ని కలిగించలేదు. మానవ జీవిత పరమార్థం గురించిన ఒక మెలకువ కూడా ఉండాలి. చరిత్ర చూచినట్లయితే ఈ అంశం బాగా బోధపడుతుంది. చాలా విశిష్టులైన చరిత్రకారులు కూడా చారిత్రిక యథార్థాలని తమ ఉద్వేగాల, ఆకాంక్షలకు అతీతంగా చూడలేకపోయినందువల్ల వాళ్లు మంచి కన్నా చెడే ఎక్కువ చేశారని చెప్పాలి. హెగెల్ చరిత్రకి సమకూర్చిన తత్వశాస్త్రం సమగ్రతలో దేనికీ తీసిపోదు. ఏమంటే ఎంతో ప్రాచీన కాలంనుంచి సుదూర భవిష్యత్తులోకీ అది చూడగలిగింది. కాని ఈ అధ్యయనమంతటి ప్రధాన అంశంగా ఆయన చూపదలచినదేమిటి? క్రీస్తు శకం నాలుగవ శతాబ్దం నుండి తన కాలం దాకా కూడా, జాతులన్నిటిలోనూ జర్మనీయే అగ్రజాతిగా ఉంటున్నదనీ, ప్రపంచ అభ్యుదయాన్నీ తన భుజాలపైనే ధరిస్తున్నదనీనూ. బహుశా సమగ్రత వివేక వంతం కావాలంటే అది కేవలం ఆలోచనగా మిగిలిపోక అనుభవంలోకి కూడా ఒదిగి వుండాలనిపిస్తుంది. తమ విజ్ఞానం విస్తారంగా ఉన్నప్పటికి సంకుచితభావాలు కలిగిన వ్యక్తులు మనలో ఎంతమాత్రం అరుదు కాదు. అటువంటి మనుషుల్లో ఏది లేదో దాన్నే వివేకమంటున్నాను.

ప్రజాజీవితంలోనే కాదు, వ్యక్తుల ప్రైవేటు జీవితంలో కూడా వివేకం ఉండాల్సిందే. తమ వ్యక్తిగత అపోహల నుండి, రాగద్వేషాలనుండి విడుదల కావడానికి తాము ఎంచుకునే మార్గాల విషయంలో ఇది మరీ ముఖ్యం. ఏదన్నా సాధిస్తే బాగుంటుందనిపించినప్పటికీ, అది ఆచరణలో పూర్తిగా అసాధ్యమని తెలుసుకుంటే, దాన్ని ఆచరించాలనుకోవడం వివేకమనిపించుకోదు. పూర్వకాలాల్లో చాలామంది సర్వవేది గురించీ, సంజీవని మూలిక గురించీ వెదుకులాడటానికి తమ జీవిత కాలమంతా ప్రయాసపడ్డారు. అవి ఒకవేళ లభ్యమై ఉంటే, మానవజాతి సౌభాగ్యానికి దోహదం చేసి వుండేవే. కాని వాళ్ళ జీవితాలు వృథాకాక తప్పలేదు.

వివేక సారాంశం ఏమిటంటే 'ఇప్పుడు' 'ఇక్కడ' అనే వాటి సంకుచితత్వాన్నుంచి ఎంతోకొంత విడుదల కలిగించడమే. మన ఇంద్రియాల సంకుచిత్వాన్ని మనం భరించక తప్పకపోవచ్చు. చూడడమూ, వినికిడీ, స్పర్శా అన్నవి మన దేహాల్లో అంతర్భాగాలు. వాటిని మనం నిరపేక్షం చెయ్యలేం. మన ఉద్వేగాలు సరిగ్గా మనలానే పనిచేస్తాయి. ఒక చిన్న శిశువు కూడా ఆకలినీ అసౌకర్యాన్నీ అనుభవించేప్పుడు, శారీరకంగా అవి తీరితే తప్ప, శాంతించలేడు. కాగా కాలక్రమేణా అతని దృష్టి విస్తరిస్తున్న కొద్దీ అతని వివేకం వృద్ధి చెందుతుంది. ఈ వృద్ధి సాపేక్షమే కావచ్చు, ప్రపంచాన్ని పూర్తి నిష్పక్ష పాతంగా ఎవరూ చూడలేరు. ఒకవేళ ఎవరన్నా అతికష్టంపైన చూడగలిగినా, అతను జీవించి మనడం అసాధ్యం. కాని ఒక నిష్పక్షపాత దిశగా నిరంతర ప్రయాణం మటుకు సాధ్యమే. ఒకవైపు దేశంలోనూ కాలంలోనూ అస్పష్టంగా కన్పిస్తున్న వాటిని గుర్తించడం ద్వారా, మరో వైపు అటువంటి వాటికి మన అనుభూతిలో ఇవ్వవలసిన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా. నిష్పక్షపాత దిశగా చేసే ఈ ప్రయత్నమే వివేకాన్ని నిజంగా వృద్ధి పొందించేది.

ఈ లెక్కన చూసినట్లయితే, వివేకాన్ని మనం బోధించగలమా? అది సాధ్యమయే ట్లయితే, ఆ బోధన అనేది మన విద్యాలక్ష్యాల్లో ఒకటి కాగలదా? ఈ రెండు ప్రశ్నలకి సాధ్యమనే జవాబివ్వాలి నేను. ఆదివారాలు ప్రార్థనా సమావేశాల్లో చెప్తుంటారు మనకి, మన పొరుగు వాళ్ళని మనలాగే ప్రేమించమని. వారంలోని తక్కిన ఆరు రోజులలోనూ మన పొరుగు వాణ్ణి ద్వేషించి తీరక తప్పదు మనకి. దీన్ని మీరు ఒప్పుకోకపోవచ్చు. మనం ద్వేషిస్తున్నది నిజంగా మన పొరుగువాణ్ణి కాదనచ్చు. కాని గుర్తు చేసుకోండి, ఈ సూక్తికి ఉదాహరణగా చెప్పిన కథలో పొరుగువాడు సమరయుడు. మనం


ఇప్పుడు సమరయులని ద్వేషించడం లేదు కదా అనుకుంటే ఈ కథలోని నీతిని మనం గ్రహించనట్టే. దీని అర్థం మీరు గ్రహించాలంటే, సమరయుడు అన్న పదం స్థానంలో 'కమ్యూనిస్టు' లేదా 'యాంటి కమ్యూనిస్టు' అన్న పదాలు పెట్టి చూడండి. బహుశా మీరు అడ్డురావచ్చు— ఎవరు హాని చేస్తారో వాళ్లని ద్వేషించడం సబబేనని. నేనలా అనుకోవడంలేదు. మీరు వాళ్లని ద్వేషించేట్లయితే, మీరు కూడా అంతే హానికర– మవుతున్నారన్నమాట. అంతేకాదు, వాళ్లు తమ దుర్మార్గాల్ని ఒదులుకునే ప్రయత్నాలు మీరు చెయ్యగలగడం సాధ్యం కాకపోవచ్చన్నమాట. చెడుని ద్వేషించడం కూడా ఒక రకంగా చెడుకి దాస్యం చెయ్యడమే. దీనికి మార్గాంతరం అవగాహన కోసం ప్రయత్నించడమే. దీనర్థం నేను ప్రతిఘటనా రాహిత్యాన్ని ప్రకటిస్తున్నానని కాదు. నేననేది, ప్రతిఘటన అనేది నిజంగా చెడు మార్గాల్ని నిరోధించడానికి సమర్థవంతంగా పనిచెయ్యగలిగేది కావాలంటే, అది మనం నెలకొల్పాలనుకునే మంచి అంశాలకి అడ్డుకునే ఏ చిన్ని బల ప్రయోగాన్నయినా పరిహరించాలి. సమగ్ర అవగాహనని ఎంత విస్తారంగానైనా పొంది ఉండాలి అనే.

నేను ప్రతిపాదిస్తున్న ఈ దృక్పథం క్రియాశీలత్వాన్ని ప్రోత్సహించదని కూడా కొందరనవచ్చు. కాని చరిత్ర అటువంటి వాదనని అంగీకరిస్తుందనుకోను. లోకమంతా ప్రొటెస్టంట్లూ, కాథలిక్కులుగా విడిపోయి ప్రతి ఒక్కడూ ఉన్మత్తుడై ఉన్న కాలంలోనే ఇంగ్లండులో ఒకటో ఎలిజిబెత్ మహారాణిగాని లేదా ఫ్రాన్సులో నాలుగో హెన్రీ చక్రవర్తిగానీ జీవించారు. అలా జీవించినందువల్ల వాళ్ల క్రియా పరత్వానికేమీ లోపం లేకపోగా ప్రయోజనకరంగానే ఉన్నారు కూడా. నేను దేన్నయితే వివేకమంటున్నానో దాన్నుంచి లేశమాత్రమయినా ఎడం కాకుండానే అబ్రహాం లింకన్ ఒక మహాయుద్ధమే చేశాడు.

ఎంతో కొంతమేరకు ఈ వివేకాన్ని బోధించగలమని నేను ఇంతకుముందు చెప్పాను. ఇటువంటి బోధనలో సాధారణ నీతిసూత్రాల బోధనకన్నా అధికమైన విశాలమైన ఆలోచన సూత్రంగా ఉండాలి. ద్వేషంవల్లా, సంకుచిత మనస్తత్వం వల్లా కలిగే ఉపద్రవకారకాలైన నష్టాలు సోదాహరణంగా ఎత్తి చూపబడాలి. నీతీ, విజ్ఞానమూ, మరీ పూర్తిగా విడివిడిగా బోధించబడాలనుకోను. నిజమే, రకరకాల నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విజ్ఞానమైన సాంకేతిక విద్యకీ నీతికీ ఏమీ సంబంధం లేదు. కాని మానవ కార్యకలాపాలమంతటా నీతి స్థానంలో నీతిని నిల్పడానికి

అవసరమైనవిధంగా విద్యా ప్రణాళికలో అది అంతర్భాగం కావాలి. గొప్ప సాంకేతిక వేత్తలు గొప్ప పౌరులు కావాలి. విజ్ఞానంలో, నైపుణ్యంలో సాధించే ప్రతి చిన్న అభివృద్ధితో వివేకం మరింత అవసరమవుతుంది.

ఏమంటే, మన ఉద్దేశ్యాలు అతి వేగంవల్ల అటువంటి ప్రతివృద్ధి మన అంతిమ ప్రయోజనాల్ని, చెడుని నిలవరించగలిగే మన శక్తిని బలహీనపరుస్తుంది. ప్రపంచం ఈ రోజు పూర్వమెన్నడూ లేనంతగా వివేకం కొరకు దప్పిపడింది. ఇక విజ్ఞానం ఈవిధంగానే వృద్ధి చెందుతున్నట్లయితే, ప్రపంచం రాబోయే భవిష్యత్తులో ఇప్పటికన్నా మరింత వివేకవంతం కావాల్సివుంది. ●




# ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

## సంఘమూ–వ్యక్తిత్వమూ

**మన** జీవితాల్నీ ప్రయత్నాల్నీ పరిశీలించుకుంటే మన కోరికలూ మన కార్య కలాపాలూ అంతా తక్కిన మనుష్యుల ఆస్తిత్వంతో ముడిపడ్డదేనని వెంటనే గుర్తిస్తాం. మన స్వభావమంతా సోషల్ ఆనిమల్స్ స్వభావాన్ని పోలి ఉన్నదేనని గ్రహిస్తాం. ఇతరులు పండించిన తిండిని మనం తింటాం. ఇతరులు తయారుచేసిన గుడ్డలు మనం కడ్తాం. ఇతరులు నిర్మించిన ఇళ్లలో మనం నివసిస్తాం. మన విజ్ఞానమూ, మన నమ్మకాలలోని అధికాంశమంతా ఇతరులు సృష్టించిన భాషద్వారా ఇతరులు మాట్లాడితే మనకు తెలిసినదే. భాషేగాని లేనట్లయితే మన మానసిక శక్తులు ఇంకా జంతుస్థాయిలో ఉండేవన్నది నిస్సందేహం. కాబట్టి జంతువులకన్నా మనం పొంది ఉన్న ఉన్నత స్థితి అంతా మనం మానవ సంఘంలో నివసిస్తూ ఉన్నందువల్ల కలిగిందేనని ఒప్పుకునితీరాలి. వ్యక్తిని పుట్టుకనుండి ఒంటరిగా వదిలినట్లయితే అతని ఆలోచనల్లో అనుభూతుల్లో మనం ఊహించనంత అనాగరికంగానూ పశుప్రాయంగానూ ఉండక తప్పదు. వ్యక్తి

అంటే అతను ఏమిటి అన్నది, ఆ ప్రాధాన్యత అతను వ్యక్తిగా పొందిందానికన్నా పుట్టుకనుండి మరణించేదాకా అతని భౌతిక ఆధ్యాత్మిక అస్తిత్వాల్ని నియంత్రించే ఒక మహా మానవ సంఘంలో సభ్యుడిగా పొందిందే!

సంఘానికి మనిషి ఇచ్చే విలువ తన తోటి మనుష్యుల శ్రేయస్సుకోసం అతను తన అనుభూతుల్ని ఆలోచనల్ని ప్రయత్నాల్ని ఏవిధంగా వినియోగిస్తున్నాడన్నదానిపై ఆధారపడుతుంది. మనం ఒక మనిషిని మంచివాడు లేక చెడ్డవాడు అనేది దీనినిబట్టే. పైకి చూస్తే ఒకరకంగా ఒక మనిషిని గురించి మన అంచనా అతని సాంఘిక గుణ గణాలమీద ఆధారపడ్డట్టే కనిపిస్తుంది.

కానీ అటువంటి ధోరణి తప్పు కావచ్చు. సంఘంనించి మనం అందుకుంటున్న భౌతిక, ఆత్మిక, నైతిక సంపద— అమూల్యమైనదంతా సృజనశీలురైన వ్యక్తులు ఎన్నో తరాలుగా సృష్టించి మనకు అందజేసినవేనని మనం గ్రహించాలి. ఎవరో ఒకప్పుడు నిప్పును ఉపయోగించడం కనుగొన్నారు. అలాగే ఒకప్పుడు వ్యవసాయాన్ని, అలాగే ఆవిరి యంత్రాన్ని మరొకళ్లు.

వ్యక్తి మాత్రమే ఆలోచించగలడు. ఆ ఆలోచన ద్వారా సంఘానికి కొన్ని కొత్త విలువల్ని సృష్టించగలడు. ఇంకా చెప్పాలంటే కొన్ని నైతిక ప్రమాణాల్ని ప్రతిపాదిస్తాడు. వాటినే సంఘజీవితం నిర్ధారిస్తుంది. సంఘమృత్తిక పోషణ లేకుండా వ్యక్తి ఉన్నతి ఏవిధంగా అనూహ్యమో అలాగే స్వతంత్రంగా ఆలోచించి నిశ్చయించుకొనే సృజనాత్మక వ్యక్తిత్వాలు లేకుండా సాంఘిక అభ్యున్నతీ అసాధ్యమే.

ఒక సంఘం జీవితం యొక్క స్వాస్థ్యం దానిలోని వ్యక్తుల సాంఘిక సాన్నిహిత్యం మీద ఎంత ఆధారపడుతుందో ఆ వ్యక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పైన కూడా ఆధారపడుతుంది. గ్రీకు-యూరోపియన్-అమెరికన్ సంస్కృతి తాలూకు పునాది, ముఖ్యంగా మధ్యయుగాల యూరోపును బద్దలుకొట్టిన, ఇటాలియన్ సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలోని దాని వికాసమంతా వ్యక్తి విమోచనవల్ల సాధ్యపడిందేనన్నది చక్కని మాట.

ఇప్పుడు మనం ప్రస్తుతం జీవిస్తున్న కాలమేలాటిదో చూద్దాం! ఇప్పుడు సంఘం ఎట్లా ఉంది? వ్యక్తి ఎట్లా ఉన్నాడు? నాగరిక దేశాల జనాభా చూసినట్లయితే అవి

పూర్వకాలంకన్నా మరింత జనసాంద్రంగా ఉన్నాయి. యూరోప్‌లో ఇవాళ వందేళ్లక్రితం అక్కడ నివసించినదానికన్నా మూడు రెట్లు అధికంగా జనాభాని వుంది. కాని అగ్రగాములైన వ్యక్తుల్ని చూసినట్లయితే వారి సంఖ్య మునుపటికన్నా క్షీణించింది. జన బాహుళ్యంలో వారి సృజనాత్మక సామర్థ్యంవల్ల వ్యక్తులుగా తెలిసినవాళ్లు కొద్ది మందే. ఉన్నతవ్యక్తుల స్థానాన్ని ఈరోజు పాలనావ్యవస్థ ఆక్రమించింది, మరీ ముఖ్యంగా సాంకేతికరంగంలో.

విశిష్టవ్యక్తులు కన్పించకపోవడమన్నది కళారంగంలో మరీ కొట్టొచ్చినట్లుగా కన్పిస్తోంది. సంగీతం, చిత్రలేఖనం స్పష్టంగా క్షీణించిపోవడమే కాదు, వాటి ప్రజామోదాన్ని కూడా పోగొట్టుకున్నాయి. రాజకీయ రంగంలో నేతలు కరువవడమే కాదు, వీరులకుండాల్సిన స్వతంత్ర వ్యక్తిత్వం, న్యాయదృష్టి గణనీయంగా నశించాయి. అటువంటి స్వాతంత్ర్యం పైన ఆధారపడిన ప్రజాస్వామ్యపు పార్లమెంటేరియన్ ఖ్యాతి అనేకచోట్ల పునాదుల్లో కదిలింది. మనుషుల ఆత్మగౌరవం, వ్యక్తుల హక్కుల గురించిన జాగృతి బలహీనపడడంతో నియంతృత్వాలు పుట్టడమేకాదు, ప్రజలు వాటిని సహించారు కూడా. ఏ దేశంలోనైనా న్యూస్ పేపర్లద్వారా మనుషుల్ని ఏవిధంగా రెచ్చగొట్టవచ్చునంటే, ఏ కొన్ని రాజకీయ పార్టీల మూర్ఖ ప్రయోజనాల కోసమో గొర్రెల్లాంటి ప్రజలు యూనిఫాంలు తొడగడమే కాదు, ఒకళ్లనొకళ్లు చంపగలరు, చంపుకోగలరు కూడా. నాగరిక ప్రపంచంలో నేడు లోపిస్తున్న ఆత్మగౌరవరాహిత్యానికి స్పష్టంగా కన్పించే నిదర్శనం కంపల్సరీ మిలటరీ సర్వీసు అన్పిస్తుంది నాకు. ఈ మన నాగరికతకి త్వరలో ముంచుకొచ్చే గ్రహణం గురించి హెచ్చరించే ప్రవక్తలకి తోడు లేకపోవడంలో ఆశ్చర్యం లేదు. కాని అటువంటి నిరాశపరుల్లో నేనూ ఒకణ్ణికాదు. మంచి రోజులు ముందు ముందు రానున్నాయనే నమ్ముతాను నేను.

నా నమ్మకానికి కారణాలు చెప్పనివ్వండి. నా ఉద్దేశంలో— ప్రస్తుత కాలంలో, ఈ విపరీత క్షీణ ధోరణులకు కారణం— మనిషి మనుగడకోసం పోరాటాన్ని ఆధునిక కాలంలోని ఆర్థిక సాంకేతికాభివృద్ధి మరింత తీవ్రతరం చెయ్యడమేననిపిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛావికాసాన్ని ఈ అభివృద్ధి, పోరాటాలు అడ్డగిస్తున్నాయి. కాని సాంకేతికాభివృద్ధి అంటే సంఘ ప్రయోజనాలకోసం మనిషి పడాల్సిన కష్టం మరింత మరింత తగ్గడమే. శ్రమవిభజన మరింత ప్రణాళికాబద్ధంగా కలుగుతుండడమే ప్రస్తుత ఆవశ్యకత. ఇటువంటి శ్రమవిభజన మనుషుల భావి జీవితానికి మరింత భద్రతని చేకూరుస్తుంది.

ఈ భ్రద్రతవల్ల మనుషులకు చేకూరే తీరికవల్లా, మిగిలే శక్తి వల్లా, అప్పుడు మనిషి తన వ్యక్తిత్వ వికాసానికి వినియోగించగలుగుతాడు. ఈవిధంగా సంఘం తన స్థానాన్ని తిరిగి పొందగలుగుతుందనీ ప్రస్తుత నాగరికత పురోగమిస్తున్న వేగంవల్ల ఒనగూడిన ఈ నాటి సాంఘిక జీవితంలోని ఈ అనారోగ్య లక్షణాలన్నిటినీ రాబోయే చరిత్రకారులు ఒక భవిష్యమహాజీవితం యొక్క బాలారిష్టాలుగానే భావిస్తారనీ ఆశిద్దాం! ●




# మహాత్మా గాంధీ

## భగవంతుడంటే

**అనిర్వచనీయమూ** నిగూఢమూ అయిన ఒక శక్తి అంతటా ప్రతి ఒక్కదాన్నీ ఆవరించి ఉన్నది. నేను దాన్ని చూడకపోయినప్పటికీ, అనుభూతి చెందగలను. ఆ విధంగా తనని మనకు ఎరుకపరుస్తూ, అప్పటికీ నాకు ఇంద్రియగ్రాహ్యవమైన తక్కిన వాటన్నిటి కన్నా భిన్నంగా, అన్ని దృష్టాంతాల్నీ నిరాకరిస్తూ తనని నాకు బోధపడేట్లు చేస్తున్న ఈ భగవంతుడి అస్తిత్వాన్ని తార్కికంగా నిరూపించడం ఏదో ఒక మేరకు అసాధ్యమే. మామూలు వ్యవహారాల్లో కూడా మనుషులు తమని ఎవరు శాసిస్తున్నారో ఎట్లా శాసిస్తున్నారో తెలుసుకోలేరు. అయినప్పటికీ తమని శాసిస్తున్న శక్తి గురించి వాళ్ళకి ఎరుకే. నేను గత సంవత్సరం నా మైసూరు యాత్రలో కొందరు బీద గ్రామీణులను కలిసినప్పుడు మాటల మధ్యలో వాళ్ళు చెప్పారు— మైసూరుని ఎవరు పరిపాలిస్తున్నారో వాళ్ళకు తెలీదని. వాళ్ళు చెప్పిందల్లా భగవంతుడే పరిపాలిస్తున్నాడని. వాళ్ళ శాసకుడి గురించి ఆ బీదజనులకున్న జ్ఞానం నిజంగా అంత పరిమితమైందే అయితే, వాళ్ళ

శాసకుడికన్నా వాళ్ళు తక్కువైన దానికన్నా మరింతగా భగవంతుడి కన్నా తక్కువైన నేను ఆ సర్వేశ్వరుడినే రాజాధిరాజుగా భావించడంలో ఆశ్చర్యం లేదు. ఆ బీద గ్రామస్థులు తమ మైసూరు గురించి భావించినట్లే నేను కూడా ఈ విశ్వమంతటిలోనూ ఒక క్రమవ్యవస్థ ఉన్నదనీ, ఇక్కడ అస్తిత్వం కలిగివున్న, జీవించివున్న ప్రతి చరాచరాన్నీ నియంత్రించే ఒక అభేద్యమైన శక్తి ఉన్నదీ అనే భావిస్తాను. ఇది అంధశాసనం కాదు. ఏమంటే ప్రాణుల ప్రవర్తనని నియంత్రించేదేదీ గుడ్డిది కాజాలదు. సర్ జగదీశ్ చంద్రబోస్ చేసిన అపూర్వ పరిశోధనల వల్ల పదార్థానికి కూడా ప్రాణముందని ఈ రోజు మనం తెలుసుకోగలిగాం. కాబట్టి మొత్తం జీవశక్తినంతటినీ శాసించే ఆ చట్టం భగవంతుడే. ఆ శాసనాలూ, శాస్తా ఒక్కరే. నేనా శాసనాన్నీ, శాస్త్రనీ కూడా ధిక్కరించవచ్చు. ఏమంటే నాకు ఆ రెంటి గురించీ తెలిసింది బహుస్వల్పం. కాగా మనం భూమ్మీద అటువంటి శక్తి విషయంలో కూడా ధిక్కారం వహించినా చెయ్య గలిగిందేమీ లేదు. అటువంటప్పుడు భగవంతుడికీ, ఆయన శాసనానికీ నా ధిక్కారం వల్ల ఏ భంగమూ వాటిల్లదు. కాగా అటువంటి దివ్య శాసనాన్ని నిశ్శబ్దంగా, వినమ్రంగా అంగీకరించడం వల్ల ఈ జీవనయాత్ర మరింత సుగమంగా సాగగలుగుతుంది.

నా చుట్టూ నిత్యం మారుతో, నిత్యం నశిస్తూ ఉన్న ప్రతిదాని మధ్యా మార్పులేని ఒక జీవనశక్తి అన్నిటినీ ధృఢంగా నిలిపి ఉంచున్నదనీ, సృష్టిస్తున్నదనీ, లయింప చేస్తున్నదనీ, తిరిగి సృష్టిస్తున్నదనీ నేను అస్పష్టంగానైనా గ్రహించగలుగుతున్నాను. ఆ శక్తి, ఆ చైతన్యమే భగవంతుడు. ఆయన తప్ప, తక్కిందేదీ, నేను కేవలం నా ఇంద్రియాల ద్వారా మాత్రమే చూస్తున్నదేదీ నిలిచి వుండటంలేదు.

ఈ శక్తి క్రూరమైందా? లేక కరుణామయమైందా? నేను చూడగలిగిన మేరకి ఆ శక్తి పరమదయాన్వితమైంది. ఏమంటే నేను చూసినంత మటుకు మృత్యువు ఒడిలో జీవితం వికసిస్తున్నది. అసత్యమధ్యంలో సత్యం నిలిచి వున్నది. అంధకారం మధ్య కాంతి వెలుగుతున్నది. కాబట్టి నేను గ్రహించుకున్నాను ఆయనే జీవమనీ, సత్యమనీ, వెలుతురనీను. ఆయనే ప్రేమ, ఆయనే సర్వేశ్వరుడనీను.

కేవలం పండితుల్నే సంతృప్తి పరిస్తే ఆయనెప్పటికీ భగవంతుడే కాదు. భగవంతుడు భగవంతుడు కావాలంటే హృదయాల్ని పాలించి వికసింపచెయ్యాలి. తనని నమ్మిన వాని ప్రతి చిన్న పనిలోనూ ఆయన వ్యక్తం కావాలి. కేవలం ఇంద్రియాలు అయిదూ

కల్పించే దానికన్నా ఉన్నతమైన సాక్షాత్కారం వల్లనే ఇది బోధపడుతుంది. ఇంద్రియ సంవేదనలు ఎంత యధార్థంగా అన్పించినప్పటికీ అవి మనవి మోసం చేసే అవకాశం ఉంది. కాగా ఇంద్రియాలకు అతీతంగా ఉండే సాక్షాత్కారమేదో అది అజేయం. బాహ్యనిదర్శనల ద్వారా కాక, వికసించిన తమ శీలంలోనూ, పరిణతి పొందిన తమ ప్రవర్తనలోనూ మాత్రమే భగవంతుడి ఉనికి గుర్తించగలమన్నది స్పష్టంగా నిరూపించబడ్డ మాట. అన్ని దేశాల, అన్ని కాలాల నిరంతరాయమైన కోవకు చెందిన ప్రవక్తల, సాధుపురుషుల అనుభవాల్లో ఇందుకు నిరూపణ లభ్యమవుతుంది. ఈ నిరూపణని నిరాకరించడమంటే నన్ను నేను నిరాకరించుకోవడమే.

కాగా ఈ సాక్షాత్కారానికి కావలసింది అవసరమైన విశ్వాసం. భగవంతుడి ఉనికిని తనలో ఎవడు పరీక్షించుకోగలడో అతడే అటువంటి సజీవవిశ్వాసాన్ని సాధించగలడు. విశ్వాసమనేది బాహ్యనిదర్శనల ద్వారా మటుకు చెయ్యగలిగేది కాదు కాబట్టి మనం చెయ్యగలిగిందల్లా ప్రపంచాన్ని పాలించే నైతికశాసనంలో, ప్రేమలో, ధర్మంలో విశ్వాసం కలిగి ఉండటమే. సత్యానికీ ప్రేమకీ విరుద్ధమైన దాన్నంతా తిరస్కరించాలనే సంకల్పం ఉన్నచోట విశ్వాసమే శ్రీరామరక్ష.

ఈ లోకంలోని చెడుకి గల కారణాల్ని నేను సహేతుకంగా వివరించలేను. అలా చెయ్యకపోవడం భగవత్సంకల్పాన్ని మన్నించడమే. కాబట్టి చెడుని ఉన్నదున్నట్టుగా అంగీకరించే వినమ్రతని ఆశ్రయిస్తాను నేను. అందుకనే భగవంతుడే దీర్ఘకాలంగా వేదన పడుతున్నవాడూ, సహనవంతుడూ అని అంటున్నాను. ఏమంటే ఈ ప్రపంచంలో ఈ చెడుని ఇంతకాలంగా ఆయనే ఓపికపట్టి ఉన్నాడు గనుక. నాకు తెలుసు ఆయన స్వయంగా నిష్కళంకుడు. ఆయనే చెడుని సృష్టించిన వాడు, అయినప్పటికీ దాని మాలిన్యం తనని తాకనివాడు.

నాకు ఇది కూడా తెలుసు— ఏమంటే ఈ ప్రపంచంలోని చెడుతో నేను పోరాటం చెయ్యందే, నా ప్రాణాల్ని ఒడ్డయినా దాన్ని వ్యతిరేకించందే నేనెప్పటికీ భగవంతుణ్ణి తెలుసుకోలేనని. నాయీ అల్ప పరిమితానుభవంతో నా విశ్వాసం నాకు మరింత బలపడుతూవుంది. నేను మరింత పరిశుద్ధం కావడానికి ప్రయత్నిస్తున్న కొద్దీ భగవంతునికి మరింత చేరువగా అనుభూతి చెందుతున్నాను. నాయీ విశ్వాసం ఇప్పటివలె ఒక సంజాయిషీగా కాక హిమాలయాల వలె అచంచలంగా, ఆ శిఖరాల

పైన ధవళకాంతుల్లాగా స్వచ్ఛంగా రూపొందాలంటే నేను మరెంతో పరిశుద్ధుణ్ణి కావాల్సి వుంది. అంతదాకా న్యూమన్ తన అనుభవంలోంచి కీర్తించిన ఈ దివ్య కీర్తన తోనే ఓదార్పు పొందుతాను..

చుట్టుముట్టిన ఈ విషాదాంధకారం నుండి
కాంతిలోకి దారి చూపు, తండ్రీ, దారి చూపు
నాకు నీ వెంట దారిచూపు.

రాత్రి గాఢాంధకారంగా ఉంది,
ఇంటికి బహుదూరంలో ఉన్నాను
దయతో నన్ను తీసుకొనిపో.

నా పాదాలకు బలాన్నివ్వు,
ఆ సుదూరదృశ్యాన్ని చూడాలన్న తహతహలేదు
ఓపిగ్గా వేసే మరొక్క అడుగు చాలు నాకు. ●




## బాలగంగాధర తిలక్

## పరిపూర్ణ మానవత్వం

**నేను** వేసుకున్న ప్రశ్న ఇది— నేను నా మానవత్వాన్ని పరిపూర్ణం చేసుకోవడానికైనా లేదా చేసుకోగలగడానికైనా ఈ ప్రపంచాన్ని వదిలిపెట్టి సన్యసించాలని నా మతం చెప్తోందా? నేను ఈ ప్రశ్నతోనే భగవద్గీత చదవడం మొదలుపెట్టాను. ఈ పుస్తకం మొదలు పెట్టినప్పుడు నా మనస్సులో ఏ ఇతర ఉద్దేశ్యాలు కానీ వాదాలు కానీ ఏవీ లేవు. చివరకు నేను గ్రహించిందేమంటే మనిషి జ్ఞానంతోగానీ, భక్తితోగానీ పరమాత్మతో గొప్పసంయోగం పొందిన తర్వాత కూడా ఈ ప్రపంచంలో తనవంతు కర్తవ్యం నెరవేరుస్తూ ఉండాలనే 'గీత' చెప్తున్నది. సృష్టికర్త ప్రపంచం ఏ సమ్యక్ పథంలో నడవాలని నిర్దేశించాడో ఆ పరిణామపథం నుంచి మనం తప్పిపోకుండా ఉండడానికే ఈ కర్తవ్యపాలన అవసరం. అయితే తను చేసిన కర్మ కర్తను బంధించకుండా ఉండడానికి ఆ కర్మఫలితం పట్ల ఏవిధమైన ఆసక్తి లేకుండాను, సృష్టికర్త ఉద్దేశ్యాన్ని బలపరచేదిగానూ ఉండాలి. దీనినే 'గీత' నేర్పిన పాఠంగా గ్రహిస్తాను.

భక్తి జ్ఞానమార్గంలో పరిణతి చెందడం ద్వారా, పరమాత్మను అందుకున్న తర్వాత కూడా, కర్మను కొనసాగించాలని గీత చెప్తున్నది. ఈశ్వరుడు, మానవుడు, ప్రపంచం— వీటిలో ఒక మౌలిక ఏకత్వం ఉన్నది. ఈశ్వరుడు సంకల్పించినందువల్లనే ప్రపంచానికి ఒక అస్తిత్వం ఏర్పడింది. ఆయన సంకల్పంవల్లనే ప్రపంచం నిలబడి ఉన్నది. భగవత్ సాన్నిధ్యం కోసమే మనిషి ప్రయత్నం. ఈ సాన్నిధ్యం సాధ్యపడినప్పుడు వ్యక్తి సంకల్పం మహా విశ్వ సంకల్పంలో ఒక్కటైపోతుంది. ఈ విధంగా లీనమౌతున్నప్పుడు 'నేనే పనీ చేయను, నేనీ ప్రపంచానికి సహకరించను' అని వ్యక్తి అనగలడా? పైగా అది పరమాత్మసంకల్పంలో భాగమే అనగలడా? కాని అది హేతువుకి నిలబడదు. ఈ మాట నేనంటున్నది కాదు, గీతే చెప్తున్నది!

ఒకవేళ మానవుడు తన దైవంతో ఐక్యాన్ని కోరుకున్నట్లయితే, అతను తప్పనిసరిగా ప్రపంచ ప్రయోజనాల్తో కూడా ఏకీభావాన్ని కోరుకోవాలి. అందుకోసం కృషి చెయ్యాలి. అతనట్లా చెయ్యకపోతే, ఆ ఐక్యం పరిపూర్ణమయినట్లు కాదు, ఎందుకంటే అక్కడ మనిషి, దైవం అన్న రెంటిమధ్యనే ఐక్యముంది తప్ప, ప్రపంచం వదిలిపెట్టబడుతోంది. ఈవిధంగా నేను నా ప్రశ్నకి సమాధానం కనుగొన్నాను. ప్రపంచాన్ని సేవించడం ద్వారానే ఆయన సంకల్పాన్ని నెరవేర్చినట్లవుతుందనీ, ముక్తికి తీసుకుపోయే యథార్థమైన త్రోవ ఇదేననీ ఇప్పుడు నేను నమ్ముతున్నాను.

అర్జునుడితో కర్మయోగం గురించి చెప్తూ ప్రభువు ఇచ్చిన గొప్ప నిర్దేశం ఇది: "లోక సంగ్రహం గురించి చూసినా కూడా నువ్వు కర్మల్ని అనుసరించక తప్పదు."

కర్మణైవహి సంస్థితం ఆస్థితా జనకాదయ:
లోక సంగ్రహ మేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి (3:20)

'మనుషుల్ని దగ్గరగా కలిపివుంచడం, వాళ్లని రక్షించడం, పరస్పర సహకారంద్వారా వాళ్లు బలోపేతులయ్యేటట్లు వాళ్లని దగ్గర చెయ్యడం, ఆవిధంగా వాళ్ల స్థితిగతుల్ని చక్కదిద్దడంలో వాళ్లని శ్రేయోమార్గాన్న నడిపించడం', 'జాతి శ్రేయస్సు' లాంటి పదాలు మనుస్మృతి (7.144)లో కూడా ఇదే అర్థంలో వాడబడ్డాయి. శంకరభాష్యం 'లోకసంగ్రహమన్న' మాటకి 'మనుషులు తప్పుదారి పట్టకుండా చూసుకోవడమని' అర్థం చెప్పింది.

జ్ఞాని దేన్ని సక్రమమని భావిస్తాడో తనవారు కూడా దాన్నే సక్రమంగా భావించి, ఆవిధంగానే నడుచుకుంటారు. మనుషుల్ని వివేకవంతుల్ని చేసి వాళ్ల జీవిత స్థితిని ఉద్ధరించాల్సింది జ్ఞానులే. కాని అటువంటి ఉద్ధరణ కేవలం నోటి మాటలతో, సలహాల్తో సాధ్యపడేది కాదు. సాధారణంగా ఎవరన్నా సలహా ఇస్తే అది ఎంతవరకు ఆచరణీయమో ఆ సలహా ఇచ్చినవారి ప్రవర్తనని— యథార్థంగా ఎలావుందో పరీక్షించి చూడకుంటే ప్రజలు పాటించడానికి ఇష్టపడరు.

కనుకనే 'గీత' చెప్తున్నది: జ్ఞాని ఎప్పటికీ కర్మని సన్యసించడని. పైగా తన ప్రయోజనంకోసం కాకపోయినా, లోక ప్రయోజనంకోసమైనా, విభిన్నరకాలైన కర్తవ్యాలను నిర్వహించడానికి జ్ఞాని కర్మని స్వీకరిస్తాడని. .. ఎవరైనా, 'లోకంలోని సృష్టి అంతా నేనే, నాలోనే సృష్టి అంతా వుంది' అన్న భావన కలిగిన ఏ మనిషైనా, 'నాకు విముక్తి లభించింది, ఇక ఎవరెట్లా దు:ఖపడితే నాకేం?' అన్నట్లయినా, ఆ మనిషి తను పొందిన జ్ఞానాన్ని తన నోటితోనే అగౌరవపరుచుకుంటున్నాడనుకోవాలి. ఆ మనిషి ఒకవేళ ఏకాంతంగా, నేననుకునే తన ధ్యానంలోనే మగ్నుడయి ఆనందం పొందుతున్నట్లయితే, ఒకరకంగా ఆ మనిషి తన స్వార్థ ప్రయోజనాలకు తను పోరాడినట్టే. .. నిజమయిన సాక్షాత్కారం పొందినవాడి హృదయంలో ఉదాత్తమైన క్రియాశీలమైన సంవేదనలూ, సమస్త భూతజాలం పట్లా అపారమయిన దయా తప్పక ఉదయిస్తాయి. అతని హృదయం తప్పక విశ్వశ్రేయస్సువైపుగా ఉద్యుక్తమవుతుంది. వేదాంత కవులు కూడా ఇదే అంటున్నారు.

అతను జీవించినంతకాలం, సంఘ శ్రేయస్సుకోసం, తన అధికారాన్ని బట్టి ఎవరయినా మనిషి బ్రహ్మజ్ఞానం పొందినా, తనకు నిర్దేశించబడిన కర్తవ్యాన్ని తను నెరవేరుస్తూ వుండవలసిందే! అయితే పరమాత్మ ఉవాచ, కర్మలన్నీ అనాసక్తంగా నిర్వహించబడాలన్నది, లోకసంగ్రహం విషయంలో కూడా సమంగా వర్తిస్తుంది.

ఫలితం పట్ల ఆసక్తి ఒదులుకోవడమంటే, అన్ని రకాల కామ్యభావనలనీ వదులుకోవడమని గానీ లేదా మనుష్య ప్రయత్నఫలాన్ని ఎవరూ కూడా అనుభవించకూడదని గానీ, లేదా ఎవరికైనా ఆ ఫలితం దక్కినా, వాళ్లు దాన్ని స్వీకరించకూడదని గానీ కాదు. మానవుడు తన ఆశయం, ఆరాటం, కుతూహలం లేదా మమకారం, ఫలితాన్ని పొందాలనుకోవడంలోని ప్రలోభం ఇవన్నీ పోవాలన్నంతలో మనిషి తన భుజాలపైన

పడిన కర్తవ్యాన్నీ, తన విధ్యుక్తధర్మాన్ని నిర్వహించాలనుకోవడంలోని ఉత్సాహం కూడా పోవాలని కాదు. నిజమే, తమ సొంత ప్రయోజనాల కోసమే పనులు చేసుకొనేవాళ్ళూ, ఫలితాన్ని పొందాలన్న ఆరాటంలోనూ, ఆతృతలోనూ కూరుకుపోయిన వాళ్లూ, ఫలితం పట్ల ఆసక్తిని విడిచిపెట్టి పని చెయ్యడం సాధ్యమేనని నమ్మలేరు. కాని, నిజమైన జ్ఞానం పొందినందువల్ల, నిజమయిన సన్యాసంవల్ల సమస్థితిని పొందిన మనస్సు కలిగిన మనుషులకి ఫలాపేక్ష లేకుండా కర్తవ్యపాలన సాధ్యమేనన్నదీ మనం మర్చి పోకూడదు. ●




## రవీంద్రనాథ్ టాగూర్

## మానవుని మతం

**నా** పద్ధెనిమిది ఏళ్ల వయసులో ఆధ్యాత్మిక అనుభవపు ఒక ఆకస్మిక వసంత మారుతం మొదటిసారిగా నా జీవితాన్ని తాకింది. ఆధ్యాత్మిక సత్యం నుంచి ఒక ప్రత్యక్ష సందేశాన్ని అది నా స్మృతిలో వదలిపెట్టి తరలిపోయింది. ఒక రోజు తొలి వేకువనే చెట్ల గుబురు ల్లోంచి పడుతున్న సూర్యకిరణాన్ని చూస్తూ నుంచుని ఉండగా ప్రపంచవదనం పైన ప్రభాతకాంతి ఒక ప్రభావంతమైన అంతరంగిక ఆనందాన్ని ఒక్కసారిగా ప్రత్యక్ష పరిచింది. హఠాత్తుగా ఒక్క క్షణం పాటు పురాతనమైన మంచు తెరల నుండి నా దృష్టి విడివడిపోయింది. అన్ని వస్తువులనూ, మనుషులనూ ఆవరించిన సామాన్యత్వపు అదృశ్యయవనిక తొలగిపోయి, వాటి పరమ ప్రయోజనం నా మనస్సులో తీవ్రంగా జాగృతమయ్యింది. సౌందర్యనిర్వచనం ఇదే అనిపించింది. ఈ అనుభవమంతటిలో స్మరణీయమైంది దీనిలోని మర్త్య మానవ సందేశమే. ఒక్కసారిగా నా చైతన్యం మానవ మహావైయక్తిక చైతన్యంలోకి కట్టలు తెంచుకుని విస్తరించడమే. ఒక నాలుగు దినాల

తర్వాత ఆ దర్శనం నెమ్మదిగా తొలగిపోయింది. నా అంతర్దృష్టిపైన తెరపడింది. ఆ చీకట్లో ప్రపంచం తిరిగి సాధారణవాస్తవజీవితమనే ముసుగును దానిపైన కప్పి వేసింది.

నేను పెద్దవాడినయ్యాక, ఏదో ఒక బాధ్యతపైన గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు, నేనొకచోట నా నివాసాన్ని ఏర్పరుచుకున్నాను. అక్కడ కాలప్రవాహం మందగతిలో నడుస్తూ, బాధానందాలు వాటి సహజ సాధారణమైన వెలుగు నీడలలో ఆవరిస్తూ ఉండేవి. అట్లాంటి రోజుల్లో, ప్రత్యేక ప్రాముఖ్యత కలిగిన ఆ రోజు, సాధారణ జీవితపు అల్పమైన చిన్నిచిన్ని సంరంభాలతోనే మొదలయ్యింది. ఆ రోజు పొద్దున్నే నేను మామూలుగా చేసుకునే పనులు పూర్తి అయిపోగానే, స్నానానికి వెళ్లబోతూ, ఒక్కక్షణం పాటు కిటికీలోంచి ఆషాఢమాసపు మొదటి వర్షానందం కోసం ఎదురు చూస్తున్న నదీ తీరపు ఎండిన ఇసుక తిన్నెల పైన జరుగుతున్న సంతని చూస్తూ నుంచున్నాను. ఒక్కసారిగా హఠాత్తుగా నా ఆత్మలో ఏదో జాగరితమైనట్టుగా తోచింది నాకు. నా అనుభవ ప్రపంచం ఒక్క క్షణంలో తేజోవంతమై, అంతదాకా విడి విడిగా ఎడంగా ఉన్న చిన్నిచిన్ని యథార్థాలన్నీ ఒక్క మహాసత్యంలోకి ఐక్యం అయినట్టుగా అనిపించింది. చుట్టూతా ఆవరించిన పొగమంచులో తన గమ్యం తనకు దొరకక దారికోసం వెదుకులాడుకునే మనిషి ఒక్కసారిగా తాను నిల్చున్నది తన ఇంటి ముందేనన్న సత్యం తెలిసినప్పుడు ఏ విధంగా అనుభూతి చెందుతాడో అటువంటి అనుభూతి అప్పుడు నాది.

నా బాల్యంలోని ఆ రోజు నాకు ఇంకా గుర్తే. అప్పుడు నేను నా మొదటి వాచకంలోని పాఠాలను, వాటి వ్యాకరణంతో, విడివిడి పదాలతో కంఠతా వెయ్యడానికి కష్టపడుతున్నాను. ఆ పొద్దుటి పూట సమయం, ఒకప్పుడు బాగా వెలిగి ఆ తర్వాత బాగా దుమ్ముపట్టిపోయి, వెలిసిపోయి, రంగుపోయి, అడ్డదిడ్డం గీతలు పడి అర్థ రాహిత్యంతో చెదలు కొట్టేసిన కాగితంలాగా ఉంది. అప్పుడు హఠాత్తుగా నా పాఠంలో నేనీ పదాల దగ్గిరికి వచ్చి పడ్డాను. వాటిని ఇట్లా అనువాదం చెయ్యొచ్చు— 'వానపడుతున్నది. ఆకులు ఊగుతున్నవి.' అంతే! ఉత్తరక్షణమే నేనొక గొప్ప ప్రపంచంలో తేలిపోయాను. అభివ్యక్తిలో సృజనాత్మకత అంచుల్ని తాకింది నా హృదయం అప్పుడు. ఇక అప్పుడు నేను తరగతి నాలుగు గోడల మధ్యన పాఠాలను వల్లె వేసే బిక్కమొగం విద్యార్థిని ఎంత మాత్రం కాను. వాన తాకిడికి వణికిపోతున్న ఆకుల సుకుమార

లయాత్మక దృశ్యం నా కనుల ముందు సాధారణమైన సమాచారాన్ని కూడగట్టే ప్రపంచాన్ని కాక నా అస్తిత్వమంతటితో సామరస్యాన్ని సాధించిన ఒక ప్రపంచాన్ని నిలబెట్టింది. అర్థరహిత శకలాలన్నీ, వాటి ఏకాంతపు పరిమితుల్ని వదుల్చుకుని, ఒక మహైక్య దర్శనాన్ని నా మనసులో సాధించాయి. అదే మాదిరిగా, ఆ రోజు ఆ గ్రామంలో ఆ ఉదయాన నా జీవితంలోని వివిధవాస్తవాలన్నీ ప్రకాశవంతమైన ఏక సత్యసూత్రంలోకి ఒదిగిపోయాయి. అంతదాకా దిమ్మరి అలలలుగా కనిపిస్తున్నవి ఒకే అపార పారావార తరంగాలుగా గోచరమయ్యాయి. నాకు అర్థం అయ్యింది— నన్నూ, నా ప్రపంచాన్నీ అవగతం చేసుకున్న గొప్ప అస్తిత్వమేదో నా ఈ అనుభవాలన్నిటా తన అభివ్యక్తి కొరకు వెతుకులాడుతున్నదనీ, విస్తృతతరమౌతున్న ఒక వ్యక్తిత్వంలోకి అపూర్వఆత్మిక కళావిన్యాసంతో ఏకీకృత మొనరిస్తున్నదనిన్నీ.

ఈ అస్తిత్వానికే నేను విధేయుడిని. ఏమంటే నాలోని ఈ సృజన ఆయనది, నాదీ కూడా. ఒక సృజనాత్మక సంయోగంలో ఆయనా నేనూ ఏకమౌతున్నామన్న నిగూఢభావన నా జీవితాన్ని మహానందంతో నింపివేసింది. ఎట్టకేలకు నేను నా మతాన్ని కనుగొన్నాననిపించింది. ఈ మతం మానవుడి మతం. ఎందుకంటే ఇక్కడ, ఒక అనిర్వచనీయ దివ్యత్వం, నా ప్రేమ కోసం, నా సహకారం కోసం అర్రులు చాస్తో మానవత్వపు పరిభాషలో నాకు మరింత చేరువయింది కాబట్టి. ●




## సర్వేపల్లి రాధాకృష్ణన్

# దివ్యత్వంలోనికి పునరుజ్జీవనం

**మన** దైనందినజీవితపు రద్దీలో, రణగొణధ్వనిలో పడి మనం మన ఆంతరంగిక అస్తిత్వపు రహస్యానికి అంధులమైపోతున్నాం. మన సాధారణ జీవితానికన్నా భిన్నమైన సంవేదనలు మనలో మేల్కొనగలవనీ, హేతువుకు అతీతమైన మార్గాలలో సత్యాన్ని అవగతం చేసుకోగలమనీ నమ్మలేక పోతున్నాం. ఏ అదృశ్య తంతువులు మననీ విశ్వాన్నీ అనుసంధిస్తున్నాయో తెలుసుకోవడానికి చాలినంత చైతన్యం మనకింకా సాధ్యపడడం లేదు. మనం పునరుజ్జీవిస్తే తప్ప మన ఆత్మోన్నత్యాన్ని మనం అందుకోలేము. జీవితశిఖరాగ్రాలను ఎవరు చేరుకోగలరో వారు అక్షరాలా పునర్జీవించినట్టే.

ఈ పునర్జన్మించడం, మహామనీషుల జీవితాలలో స్పష్టంగా అభివ్యక్తమవుతున్నప్పటికీ, అది మనలో కూడా లేకపోలేదు. ఆ ఔన్నత్యాన్ని మనం సాధించలేక పోయినప్పటికీ దానిని ఎవరు సాధించగలిగేరో వారికి శ్రద్ధాంజలి ఘటించడానికి

సిద్ధంగానే ఉన్నాము. వారి ఆలోచనలు, చేతలు, జీవన సంగీతాలు మనలో ఒక ఆరాధనోత్సుకతను రగిలిస్తున్నాయి. మనలో కూడా అటువంటి ఆత్మే లేకపోయినట్టయితే కళలో, సైన్సులో జీవితంలో మానవుడు సాధించిన గొప్ప విజయాల ఎదుట మనం ముఖాముఖి నిల్చున్నప్పుడు మనలో ఎందుకంత ఆనందం ఉప్పొంగుతోంది? వారి ఉద్వేగాల తీవ్రతనూ, వారి వీరత్వపు వైభవాన్నీ, వారి సంతోష దర్శనాలనూ మనవిగా ఎందుకు సంభావించుకుంటాం?

కావ్యసంగీతం మన ఆత్మలో అర్థం వెదుక్కుంటుంది. వారి మాటలు మన మాటల్లో ప్రతిధ్వనిస్తాయి. మన జీవితమంతా వెన్నాడే ప్రకాశం మనలోని అజ్ఞాత ఆత్మని ఒక్క సారిగా గుర్తుకుతెస్తుంది. ఎవరేనా తన హృదయపులోతుల్లోంచి ఒక్క మాట మాట్లాడితే ఆ క్షణమే అది తనలాంటి వేలకొద్దీ మూగ గొంతులకు ముక్తినిస్తుంది. కవి మాటలను మనం మన స్వంత మాటలుగా చెప్పుకుంటాం. వేదాంతి భావాలను మన ఉన్నత భావాలుగా ప్రకటించుకుంటాం. మహనీయుడైన సాధువు ఎవరైనా పొందిన పరిణితిని చూసి అది మనం కోరుకుంటున్నదే, మనం పొందబోతున్నదే అని అనుకుంటాం. ఏదైనా మనకు సన్నిహితమనిపిస్తేనే దాన్ని అర్థం చేసుకోగలుగుతాం. ఏ దృశ్యమో, కావ్యమో, జీవితమో, మనపై ఒక అద్భుత ప్రభావాన్ని కలుగజేస్తే మన హృదయాంతరాళాల్లో దానికి ఒక అద్భుతమైన ప్రతిస్పందన ఉన్నదని మనం నమ్ముతాం. మనలో ప్లేటో వంటి ఆత్మ లేకుండా మనకి ప్లేటో అర్థం కానేకాడు. క్రీస్తు అర్థం కావాలంటే మనకు తప్పకుండా క్రీస్తు హృదయం ఉండి తీరాలి. గొప్ప వైశిష్ట్యానికి మనని ప్రకాశ భరితం చేసి, మనని సమూలంగా మార్చి వేసి, మనలో నీచమైందీ, తక్కువదీ, తాత్కాలికమైందీ అయిన దాన్నుంచి విముక్తపరిచే శక్తి ఉంది. అది కేవలం మన ఇంద్రియాలను ఉద్రేకపరచడమో లేక మన మనసును ఉల్లాసపరచడమో కాదు, మన ఆత్మలను తాకి మన అస్తిత్వాన్ని మార్చి వేస్తుంది. ఆ వైశిష్ట్యం ద్వారా మనం జీవితపరమార్థం గురించిన ఒక మహోన్నతజాగృతి పొందగలుగుతాము.

భగవత్ ప్రేమికుల పరిచయం కన్న ఆధ్యాత్మిక జీవితపు యాథార్థ్యానికి వేరే దృష్టాంతం లేదు. వాళ్ళు మన సందేహాలనుంచి మనల్ని విదిలించి వేస్తారు. వారు అనంత సందేశపు వార్తాహరులు. భవిష్య మానవుడి తొలి ఫలాలు. మనందరం తిరిగి జన్మించవలసి ఉంది. దివ్య అస్తిత్వం యొక్క సంపూర్ణత్వాన్ని పంచుకోవలసి ఉంది. మన వారసత్వాన్ని తెలుసుకోవలసి ఉంది. ●




# బి.ఆర్. అంబేద్కర్

## ఆ దమ్మం ప్రజ్ఞాన్వితం, కరుణాన్వితం

**బుద్ధుడు** దమ్మమని చెప్తున్నది మతంతో మౌలికంగా విభేదిస్తుంది. దమ్మమంటే ఏమిటో వివరించడం ద్వారా అది మతంనుండి ఎట్లా విభేదిస్తుందో చూడడం మంచిది. మతం అనేది వ్యక్తిగతం, వ్యక్తి తనకోసం తాను నిర్ణయించుకొనేది. అది ప్రజాజీవితం మధ్యలో నిలిపేది కాదు. కాని, దమ్మం ఇందుకు వ్యతిరేకం. అది పూర్తిగా సాంఘికం— మౌలికంగానో, తప్పనిసరిగానో కూడా. దమ్మమంటే సమ్యక్స్వభావం— అంటే జీవిత రంగాలన్నిటా మనిషికీ మనిషికీ మధ్య చక్కని సంబంధం. దీని ద్వారా అర్థమయ్యే దేమంటే— ఎవరయినా ఒక్క మనిషి ఒక్కడూ మటుకే ఉండేట్లయితే అతనికి దమ్మంతో పనిలేదు. అదే ఇద్దరు మనుషులు ఒకరితో ఒకరు కలిసిమెలిసి జీవించవలసినట్లయితే వాళ్లకి ఇష్టమైనా, కాకపోయినా దమ్మం లేకుండా కుదరదు. దీన్నే మరోలా చెప్పాలంటే, దమ్మం లేకుండా సంఘం మనజాలదు. సంఘం తన ముందున్న మూడు ప్రత్యామ్నాయాల్లో ఏ ఒక్కదాన్నో ఎంచుకోవాలి. దమ్మమనేదాన్ని ఒక పాలనో–

పకరణంగా పాటించకపోవడం— ప్రభుత్వం లేకుండా దమ్మం లేదు కనుక పాలనా దమ్మం లేని సంఘం అరాచకం పాలుకాక తప్పదు.

రెండవది, సంఘం పోలీసు బాధ్యతని ఎంచుకోవడం, అంటే నియంతృత్వాన్ని పాలనోపకరణంగా స్వీకరించడం. మూడవది సంఘం దమ్మంతోపాటు ఒక మేజిస్ట్రేటుని కూడా స్వీకరించడం, ప్రజలు ఎక్కడెక్కడ దమ్మాన్ని పాటించడం మానేస్తారో అటువంటి సందర్భాల్ని కనిపెట్టుకోవడంకోసం. అరాచకత్వంలోనూ, నియంతృత్వంలోనూ స్వేచ్ఛ నశిస్తుంది. మూడవ మార్గంలోనే స్వేచ్ఛ మనగలుగుతుంది. కాబట్టి స్వేచ్ఛని కోరుకొనేవాళ్లు దమ్మాన్ని కలిగివుండాలి. కాబట్టి దమ్మమంటే ఏమిటి? అది ఎందుకు అవసరం? బుద్ధుడు చెప్పిందాన్నిబట్టి 'దమ్మం' ప్రజ్ఞాన్వితం, కరుణాన్వితం. ప్రజ్ఞ అంటే అవగాహన. ఆయన ఎటువంటి అపోహలకీ, అపనమ్మకాలకీ తావివ్వకూడదు అనుకున్నాడు కాబట్టే ప్రజ్ఞని దమ్మం యొక్క రెండు మూలస్తంభాల్లోనూ ఒకటిగా నిలబెట్టాడు. కరుణ అంటే ప్రేమ. ప్రేమ లేకుండా సంఘం మనజాలదు, ఎదగజాలదు. కాబట్టే దమ్మానికి దాన్ని రెండో మూలస్తంభంగా నిలబెట్టాడు బుద్ధుడు. దమ్మమంటే ఇచ్చిన ఈ నిర్వచనం మతం లోబడే రాకున్నా ఎంత భిన్నమయినది! ఎంత ప్రాచీన సత్యంగా విన్పిస్తున్నది! అయినప్పటికీ ఎంతో యథార్థంగా ఉన్నది, ఎంతో సత్యంగా ఉన్నది. బుద్ధుని దమ్మం ప్రజ్ఞ, కరుణల ఒక విశేష సమ్మిళితం. వస్తువుల ఆరంభాన్ని గురించిన తలపోతతో కూడుకున్నది మతం కాగా దమ్మానికి అటువంటి సమస్య లేదు. మతం ప్రయోజనం ప్రపంచావిర్భావాన్ని గురించి విశదీకరించడం కాగా, ప్రపంచాన్ని పునర్నిర్మించే ప్రయోజనం దమ్మం.

మతంలో నీతికి స్థానంలేదు. మత సారాంశం దైవం, ఆత్మ, ప్రార్థన, ఆరాధన, క్రతువులు, కర్మకాండ మొదలైనవాటితో కూరుకొన్నది. మనిషి మరొక మనిషితో కలిసి ఉండవలసినప్పుడే నీతి అవసరమౌతుంది. మతం దృష్టిలో నీతి మంచి చెడ్డల్ని చూసే ఒక పార్శ్వం మాటుకే. మతం ఒక త్రికోణం. నువ్వు నీ పొరుగువానితో మంచిగా ఉండు, ఎందుకంటే మీరు దేవుని బిడ్డలు కనుక అని వాదిస్తుంది మతం. ప్రతి మతం నీతిని బోధిస్తుంది, కాని నీతి మత సారాంశం కాదు. అది మతానికి అనుసంధించిన ఒక శకటం మటుకే. సందర్భాన్నిబట్టి ఆ శకటాన్ని తగిలించవచ్చు లేదా తొలగించవచ్చు. మత కార్యకలాపంలో నీతి నిర్వహించే పాత్ర చాలా యాదృచ్ఛికంగా సందర్భానుసారం ఉంటుంది. కాబట్టి మతాల్లో నీతి ప్రభావం స్వల్పం.

మరి దమ్మంలో నీతి స్థానం ఏమిటి? సులభంగా చెప్పాలంటే నీతే దమ్మం, దమ్మమే నీతి. మరో మాట చెప్పాలంటే దమ్మంలో భగవంతుని స్థానాన్ని నీతి ఆక్రమిస్తుంది. వాస్తవానికి దమ్మంలో భగవంతుడంటూ లేకపోయినప్పటికీ ప్రార్థనలకీ, తీర్థయాత్రలకీ, క్రతువులకీ, కర్మకాండలకీ స్థానంలేదు. దమ్మం యొక్క సారాంశమంతా నీతే. నీతి లేకుండా దమ్మం లేదు. మనిషికి తోటి మనిషిని ప్రేమించాల్సిన ఆవశ్యకతలోంచే దమ్మంలో నీతి ప్రవహిస్తుంది. దానికి ఏ భగవంతుడి ఏ అనుజ్ఞలూ అవసరంలేదు. భగవంతుని తృప్తి పరచడానికి కాదు మనిషి నీతిని పాటించవలసింది. మనిషి తన సొంత మంచికోసమే తోటి మనిషిని ప్రేమించవలసింది. ●




## శ్రీరామ్!

**నిన్న** పొద్దున్న శివ రాచర్ల వాల్ మీద వెలమూరి శ్రీరామ్ ఫొటో చూస్తూనే, మనసు ఏదో కీడు శంకిస్తుండగా, అక్కడ ఏమి రాసి ఉందా అని చదివాను.

నమ్మలేని వార్త. నమ్మకూడని వార్త.

నా జీవితంలో వెలమూరి శ్రీరామ్ వంటి వ్యక్తుల్ని అతి కొద్ది మందిని మాత్రమే చూసాను. హృదయం ఉండవలసిన చోట ఇంత వెన్నముద్ద పెట్టుకుని తిరిగిన అపురూపమైన మనిషి ఆయన.

1998-99 నాటి మాట. నేనప్పుడు శ్రీశైలంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్నాను. చెంచువారి కోసం పనిచేసే ఆ ప్రాజెక్టు పరిధిలో ఆరు జిల్లాలున్నప్పటికీ, దోర్నాల మండలం, యెర్రగొండపాలెం మండలాల్లో ఉండే చెంచువారి జీవనస్థితిగతులు

నాకెప్పటికీ కొత్త సవాళ్ళు విసురుతూనే ఉండేవి. వారి అభివృద్ధి కోసం పనిచెయ్యవలసిన సంస్థను నడిపిస్తున్న అధికారిగా విద్యాధికారుల్నో, వైద్యాధికారుల్నో కలవవలసి ఉండటం వేరు. కానీ రోజూ ఫారెస్టు అధికారుల్నో, పోలీసు అధికారుల్నో, ఎక్సైజ్ అధికారుల్నో కలుసుకోవలసిన అవసరం పడుతుండటం వేరు. అటువంటి పరిస్థితుల్లో ఆ శాఖలకు చెందిన అధికారులతో మాట్లాడటమే ఒక ఛాలెంజిగా ఉండేది. వాళ్ళకి చెంచువారి పట్ల ఉండే prejudices ని పదే పదే వినవలసి రావడమూ, వారికి పదే పదే clarify చెయ్యాల్సి రావడమూ రెండూ కూడా చాలా విసుగ్గా, ఒంట్లో ఓపిక తోడేసేటంత కష్టంగానూ ఉండేవి. అలాంటి రోజుల్లో దోర్నాలకి ఒక కొత్త ఎస్సై వచ్చారనీ, ఆయన చాలా సానుకూలంగా మాట్లాడుతున్నారనీ ముందు చెంచువారి ద్వారా విన్నాను, తర్వాత మా క్షేత్రస్థాయి అధికారులద్వారా విన్నాను. అంతలోనే ఆయన్ని కలవాల్సిన అవసరం కూడా వచ్చిపడింది.

ఒక చెంచుగూడేనికి సంబంధించిన ఏదో తగాదా, ఏదో తగాదా అంటే, పెద్ద తగాదేనే, ఒక చెంచు మరొకడిపైన అంబులు ఎక్కుపెట్టి గాయపర్చడం లాంటి సంఘటన. మామూలుగా అయితే ఆ చెంచుని హత్యానేరం కింద న్యాయస్థానాలకు పట్టుకు పోయి ఉరిశిక్ష వేయించినా కూడా ఆ సంగతి ఎవరూ పట్టించుకుని ఉండే వారు కాదు. కానీ ఈ కొత్త పోలీసు అధికారి ప్రజల కష్టసుఖాలు చెవొగ్గి వింటున్నాడని విన్నాను కాబట్టి నాకు తెలిసిన సమాచారం నేనే పోయి చెప్తే ఆయన ఈ కేసును సానుకూలంగా పరిశీలించగలడనిపించింది.

నాకు బాగా గుర్తు. నేనేవో చెంచుగూడేలకు పోయి రాత్రి ఏడున్నరా ఎనిమిది గంటల టైములో పోలీసు స్టేషన్‌కి వెళ్ళాను. అక్కడ చూసాను మొదటిసారి శ్రీరామ్‌ని. ఆయన నా గురించి చాలా విన్నాననీ, అది కూడా ఉద్యోగపరంగా కాదు, సాహిత్య పరంగా అని చెప్పడం నాకు ఆశ్చర్యం కలిగించింది. అక్కడ ఆ పోలీసుస్టేషన్‌లో పోలీసుదుస్తుల్లో ఉన్న ఒక యువకుడు చలం గురించీ, బుచ్చిబాబు గురించి మాట్లాడు తుంటే, మరీ ముఖ్యంగా, అప్పటి నా మానసిక పరిస్థితిలో ఎలా ఉండి ఉంటుందో మీరూహించగలరు.

ఆ తర్వాత కాలం, దూరం మా మధ్య తెచ్చిన మౌనాన్ని ఫేస్ బుక్ మాధ్యమం బద్దలుకొట్టేసింది. 2018 లో నేను బ్లాగు తెరిచిన తరువాత, ప్రతి రోజూ ఆ బ్లాగుని సందర్శిస్తూ వచ్చిన అతికొద్దిమందిలో శ్రీరామ్ పేరే మొదటిసారి చెప్పాలి.

'నా మార్నింగ్ వాక్ లోనో, జిమ్ లోనో లేదా ప్రయాణాల్లోనో మీ మోహన రాగం ప్రసంగాలు వింటూ గడవని రోజులేదు. మీరు హేమంతం మీదా శరత్తు మీదా మాట్లాడిన ప్రసంగాలు మొత్తం అప్పచెప్పగలను' అని అన్నారాయన. 2024 లో నా పుట్టినరోజు సందర్భంగా ఆయన తన వాల్ మీద రాసిన మాటలు నిష్కారణంగా కురిపించిన తేనె. 'కనీసం రోజుకి ఒక గంటసేపు ఆయన వెబ్‌సైట్లో విహరించడం, ఉదయం పూట నడకలో కనీసం ఒక గంట ఆయన ప్రసంగాలు వినడం నేను చేసుకున్న అనేక అనేక అదృష్టాల్లో ఒకటి' అని రాసారక్కడ.

కానీ ఆయనిలాంటి ప్రేమాభిషేకం నా ఒక్కరికే చేసారనుకుంటే పొరపాటు. నిన్న ఒంగోల్లో ఆయన పార్థివదేహానికి వీడ్కోలు పలకడానికి కనీసం పదివేలమంది వచ్చి ఉంటారని శివ రాచర్ల రాసారు. సాహితీకారుల్నీ, ఉన్నతాధికారుల్నీ, సినిమా ప్రముఖుల్ని ఆత్మీయంగా పలకరించేవాళ్ళు చాలామందే ఉంటారు. కానీ ఒక హోం గార్డుని కూడా అంతే ఆత్మీయంగా పలకరించే మనిషి ఆయన. ఉద్యోగంలోనూ, జీవితంలోనూ మనుషుల హెచ్చు తగ్గులు చూడనివాడు. పైపై మాటలు మాట్లాడనివాడు. అసలు మాటల్తో పని కూడా లేదు ఆయనకి. ఒక్కసారి మనతో కరచాలనం చేస్తే చాలు జీవితాంతం ఆ స్నేహస్పర్శ మర్చిపోలేం.

రెండు సార్లు నేనాయన్ని కలుసుకునే అవకాశం లభించింది. నాలుగేళ్ళ కిందట పొదిలిలో నాయని సుబ్బారావుగారిని స్మరించుకోడానికి సాయి పాపినేని గారితో కలిసి వెళ్తున్నప్పుడు ఒంగోలులో కలిసాం. మూడేళ్ళ కిందట గుండ్లకమ్మ లోయలో పురావస్తు పరిశోధనలు చేస్తున్న బృందాన్ని కలుసుకోడానికి సాయిపాపినేనిగారితో కలిసి వెళ్ళాను. అప్పుడు మేము పామూరులో ఒక హోటల్లో ఉన్నాం. శ్రీరామ్ ఆ హోటల్‌కి వచ్చి మమ్మల్ని కలుసుకున్నారు. మాతో పాటు తాను కూడా ఆ పరిశోధనలు జరుగుతున్న ప్రాంతానికి వచ్చారు. ఆ మధ్యాహ్నం మేము తిరుగుతున్న ప్రాంతంలో భోజనం దొరకడం కష్టం. అటువంటిది శ్రీరామ్ ఎవరితోనో మాట్లాడి ఒక చిన్న హోటల్లో పెద్ద విందు ఏర్పాటు చేయించారు.

అసలు ఆ రోజంతా ఆయన నన్ను తన వెహికిల్‌లోనే కూచోబెట్టుకున్నారు. ఆయన వృత్తిరీత్యా అప్పుడు ఇంటలిజెన్సులో పనిచేస్తున్నారు. ఆ వెహికిల్‌లో వైర్ లెస్ పదే పదే మోగుతూనే ఉండేది. ఆ సాయంకాలం ఆ ప్రయాణంలోనే ఆయన పై

అధికారుల్తో ఒక టెలి కాన్ఫరెన్సు లాంటిది కూడా జరిగింది. కానీ ఆ రణగొణధ్వని మధ్యనే ఆయన నాతో సాహిత్యం గురించి మాట్లాడుతూనే ఉన్నారు. కూంబింగ్ గురించీ, ఎన్‌కౌంటర్ల గురించీ, నక్సలైట్లకీ ప్రభుత్వానికీ మధ్య జరిగే పోరాటం గురించి ఆ అరగంటలోనే ఆయన నావెన్నో సందేహాలు నివృత్తి చేస్తూనే ఉన్నారు.

ఒక పోలీసు స్టేషన్ ఎలా పనిచేస్తున్నదో చూడాలని అంటే, మేము పామూరు రాగానే, ఆయన ఆ ఊళ్ళో పోలీసు స్టేషన్‌కి తీసుకువెళ్ళారు. అక్కడ ప్రతి ఒక్క విభాగం గురించీ కూలంకషంగా వివరించారు. కానీ నన్ను ఆకట్టుకున్నది అక్కడ ఆయన తన సహ పోలీసు ఉద్యోగుల్ని పలకరించిన తీరు, వాళ్ళీయన్ని పలకరించిన తీరూను. వాళ్ళ మధ్య కుటుంబసభ్యుల్లో ఉండే ఆత్మీయత కనిపించింది నాకు.

మేము తిరిగి వచ్చాక ఆయన నాకు ఒక బుట్టెడు ఉలవపాడు మామిడిపండ్లు పంపించారు. ఆ పండ్లు తిన్నంతసేపూ తాను నాకు గుర్తొస్తానని అన్నారు. కానీ ఇక మీదట ఉలవపాడు మామిడిపండు అనే మాటవినగానే వెలమూరు శ్రీరామ్‌నే నాకు జీవితమంతా గుర్తొస్తుంటాడని చెప్పగలను.

ఈ మధ్యనే ఎప్పుడో ఒకరోజు హటాత్తుగా ఫోన్ చేసి తనకి డి.ఎస్.పిగా ప్రమోషన్ వచ్చిందని చెప్పారు. చాలా సంతోషమనిపించింది. ఇంకా సర్వీసు ఎంత ఉందీ, ఎస్.పి అయ్యే అవకాశాలు ఎంతున్నాయి లాంటివేవో మాట్లాడుకున్నాం కూడా.

శ్రీరామ్ ! మీకు నివాళి అనే మాటలు రాయలేకపోతున్నాను. మిమ్మల్ని దోర్నాల్లో కలుసుకున్న పాతికేళ్ళ తరువాత మళ్ళా అకస్మాత్తుగా ఎలా కలుసుకున్నామో అలానే మళ్ళా కలుసుకుంటామని ఆశగా ఉంది. మంచి మనుషుల్ని తలుచుకునే కొద్దీ ఆనందం అధికమవుతుందని గురజాడ తన డైరీలో ఒకచోట రాసుకున్నాడు. మిమ్మల్ని ఎప్పుడు తలుచుకున్నా ఒక నిజమైన మనిషిగా, ఒక స్నేహమయస్వభావుడిగా, ఒక సాహిత్యపిపాసిగా మా తలపుల్ని సదా సంతోషమయం చేస్తూనే ఉంటారు. ఇన్నాళ్ళూ ఎక్కడో దూరంగా ఉన్నారు. ఇప్పణ్ణుంచీ నా హృదయంలోనే ఉంటారు. ●

12-6-2026

వాడ్రేవు చినవీరభద్రుడు

# ప్రత్యూషపవనాలు

ఎవరేనా చెప్పిన మంచి మాటలు చదువుతున్నప్పుడు మనలో ఒక ప్రత్యూష కాలపు తెమ్మెర వీచిన అనుభూతి కలుగుతోందంటే మనం మానసికంగా చాలా నిర్మలంగా ఉన్నట్టు. మనలో ప్లేటో వంటి ఆత్మ లేకుండా మనకి ప్లేటో అర్థం కాదనీ, క్రీస్తుని మనం ఇష్టపడాలంటే మనకు క్రీస్తు హృదయం వంటి హృదయం ఉండి ఉండాలనీ డా. రాధాకృష్ణన్ అన్నాడు. కాబట్టి అటువంటి ఉత్తమ వ్యక్తుల మాటలు వింటున్నప్పుడు మనకి సంతోషం కలుగుతోందంటే ఆధ్యాత్మికంగా మనం చాలా సారవంతంగా ఉన్నామనే అర్థం.

అటువంటి సారభూతమైన మనస్సు ఉన్నప్పుడు మనం మంచి మాటలు వింటే మంచి తలపులు కలుగుతాయి. మంచి తలపులు మన జీవితాన్ని మంచి జీవితంగా మారుస్తాయి. 'మంచి అన్నది పెంచుమన్నా' అని మహాకవి అన్నాడంటే దాని అర్థం మనం సదా ఆ మంచివైపు జరుగుతూనే ఉండాలని. అందుకని అటువంటి కొన్ని మంచిమాటలు మీతో ఇలా పంచుకుంటున్నాం.

1996 లో వాడ్రేవు చినవీరభద్రుడు వెలువరించిన ఈ సంకలనం చాలాకాలంగా అందుబాటులో లేదు. దాన్ని తిరిగి ఇలా మళ్ళీ అందిస్తూ మంచి మనిషి వెలమూరి శ్రీరామ్ స్మృతికి అంకితమిస్తున్నాం.